తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## ఈత సరదాకు ఓ నిండు ప్రాణం బలి



విద్యార్థి సురేంద్రరెడ్డి(ఫైల్ ఫోటో)

వెదురుకుప్పం,ఆగస్టు 5 ప్రభాతవార్త:

ఈత సరదాకు ఓ నిండు ప్రాణం బలైన సంఘటన మండలంలోని మారేపల్లి మద్దెల మానుమడుగు ప్రాజెక్టులో శనివారం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే.. బిఎస్సీ అగ్రికల్చరల్ ఇన్‌ట్రన్‌షిప్ శిక్షణ కోసం 45 మంది విద్యార్థులు మండలంలోకి రావడం జరి గింది.వీరు శనివారం సరదాగా ప్రాజెక్టులో ఈతకు వెళ్లారు. అందులో కర్నూలు జిల్లా బనగానిపల్లెకు చెందిన సురేంద్రరెడ్డి(22) సరదాగా ఈత కొడుతూ ఉండగా హటాత్తుగా ఏం జరిగిందో తెలియదు గానీ నీటిలో మునిగి పోయాడు. గమనించిన సహచర విద్యార్థులు అతని ఆచూకీ కోసం గాలించారు.వారి ప్రయత్నం ఫలించక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు పుత్తూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం అవ్వడం వల్ల చీకటిలో చేసేదేమీ లేక వారి గాలింపు చర్యలు ఆపేశారు.ఈ విషయం విద్యార్థి కుటుంబ సభ్యులకు తెలియచేశారు.నీటిలో గల్లంతైన పార్థివ దేహాన్ని వెలికితీయడానికి ఆదివారం చర్యలు చేపడుతామని అగ్నిమాపక సిబ్బంది,పోలీసులు తెలిపారు.

# బియ్యపురెడ్డి అవినీతిని వదలిపెట్టను

### శ్రీకాళహస్తిని కేకు ముక్కలా మలచుకొని తింటున్నారు
### నేను తయారు చేసా: ఎంఎల్ఏ భోజనం చేస్తున్నారు : నారాచంద్రబాబునాయుడు ధ్వజం



.శ్రీకాళహస్తి బహిరంగసభలో మాట్లాడుతున్న నారాచంద్రబాబునాయుడు

శ్రీకాళహస్తి,ఆగస్టు 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి కేకులా తయారు చేసాను. పరిశ్రమలు స్థాపించాను. విద్యాసంస్థలు ఏర్పాటు చేసాను.గోపాలన్న పరిపాలించిన కాలంలో ఈ బియ్యపు రెడ్డి ఎక్కడున్నాడు?అని తెలుగుదేశం అధినేత నారాచంద్రబాబునాయుడు ధ్వజమెత్తారు. ఇక్కడి బేరివారి మండపం వద్ద శనివారం ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల విధ్వంసం పై రణభేరి కార్యక్రమాల్లో భాగంగా బహిరంగ సభను ఏర్పాటు చేసారు.ఈ సభలో నారాచంద్రబాబునాయుడు స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డిపై తీవ్ర విమర్శలు చేసారు.నేను ఇక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేయాలంటే బియ్యపు రెడ్డి అనుమతి కావాలా? ఎవడండి ఈ బియ్యపు రెడ్డి? ఆయన అవినీతికి అంతులేకుండా పోతుందని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో బియ్యపు కుటుంబపాలన సాగుతుందన్నారు.స్వర్ణముఖి నదిలో ఒకప్పుడు నిండా ఇసుక ఉండేది. నేడు అంతా మాయం. పుణ్యక్షేత్రంలో గంజాయి వ్యాపారం సాగుతుంటే పట్టించుకునే దిక్కులేదు.కానీ బియ్యపురెడ్డి అవినీతికి అంతం లేకుండా ఉంది.

**రాహుకేతుపూజల్లో వాటాలూ వదలటం లేదు:**

శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు రెడ్డి ఏమనుకుంటున్నాడో అర్ధం కావటం లేదు. నేను నా సైకిల్ స్పీడ్ పెంచితే నీ బియ్యం నూకలు అయిపోతాయి. 4సంవత్సరాల ఎంఎల్ఏగా ఉంటేనే నీకింతుంటే 45సంవత్సరాల రాజకీయ జీవితంలో నాకు ఎంతుండాలి? ఇసుక అక్రమరవాణా? ఎక్కడ భూములంటే అక్కడ తిష్ట చివరకు శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రాహుకేతుదోష నివారణ పూజల్లో వాటాలుకూడా వదలటం లేదంటే ఆయన అవినీతి అర్థమౌతుంది.కోబాకలో ఎర్రగ్రావెల్,రేణిగుంట మండలం వెంకటాపురంలో 30 ఎకరాలు, రేణిగుంట ఎంఆర్ఓ ఆఫీస్ పక్కన 10 ఎకరాలు ఆక్రమించుకున్నారు.శనిలాగా తయారయ్యాడు.ఆయన గురించి ఏ పదం వాడాల్లో అర్థం కావటం లేదు. పరిశ్రమల్లో టెండర్లు, కమిషన్లు కావాలి.బంధువర్గం అంతా బ్రహ్మాండమైన కేక్‌గా భావించి పంచుకుంటున్నారు. కంపెనీలు వచ్చాయి. భూములధరలకు రెక్కలు వచ్చాయి. బియ్యపు రెడ్డి వచ్చాడు. రేపు నా మీద విరచుకుపడతాడు. నువ్వు రెచ్చిపోతే నా సైకిల్ స్పీడ్ పంపుతా. బియ్యాన్ని ముక్కల చేస్తా! దోశలు చేసి తినేస్తా.ముష్టిబియ్యం తాకితే పాపం అని ఓ చెల్లి చెబుతుందన్నారు.పశువులకు వేసినా పాపమే అని చంద్రబాబునాయుడు విమర్శించారు.ఆయన అవినీతిని వదలి పెట్టను బోను ఎక్కిస్తానని చంద్రబాబునాయుడు ధ్వజమెత్తారు. కార్యక్రమాల్లో కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, మాజీ ఎంపి పనబాకలక్ష్మి,బొజ్జలబృందమ్మ, మాజీ మంత్రి నెలవలసుబ్రమణ్యం, మాజీ ఎంఎల్ఏలు సత్రవాడమునిరామయ్య, ఎస్సీవీనాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, వజ్రంకిషోర్, ఉమేష్‌రావు, మాజీ కౌన్సిలర్ శెంజిగరంసుప్రజ, రేణుకమ్మ, తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, పాలసరఫరా మాజీ ఛైర్మన్‌రావిళ్ళమునిరాజనాయుడు, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు,రాంబాబునాయుడు, బొల్లినేని జగన్నాధంనాయుడు, బుజ్జి, షాకిరాలీ, అస్మత్, డివినారాయణ, ఖాదర్‌బాషా,తదితరులు పాల్గొన్నారు.

### పోలీసులు మంచివాళ్ళు: కొందరు అధికారులు దారి తప్పారు!

పోలీసులు తమ్ముళ్ళు చాలా మంచి వాళ్ళు. అయితే ఒకరిద్దరు అధికారులు దుర్మార్గులకు కొమ్ముకాస్తు వ్యవస్థను అభాసుపాల్జేస్తున్నారు.కానీ రాష్ట్రంలో జరుగబోవు కురుక్షేత్రయుద్ధంలో పోలీసులు నీతి నిజాయితి పక్షాన నిలబడండి మీకు అండగా నేనుంటానని నారాచంద్రబాబునాయుడు అన్నారు.శనివారం బేరివారి మండపం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పోలీసుల గురించి మట్లాడారు.శుక్రవారం జరిగిన సంఘటనకు సంబంధించి మాట్లాడుతూ తాను పుంగనూరులో ప్రవేశించలేదు. బైపాస్‌నుంచి వెళ్ళాను తాను పూతల పట్టుకు వెళ్ళాలంటే ఎలా వెళ్ళాలి? నేడు పుంగనూరు నుంచి వెళ్ళాను కాబట్టి దాడులు జరిగాయట. అ అధికారి చెబుతాడు. పుంగనూరు పుడింగి చెప్పింది చెబుతున్నాడు.పోలీసులు తమ బాధ్యతలను బాధ్యతగా వ్యవహారించాలి. తాను పోలీసుల్లో సంస్కరణలు చేపట్టాను.రాబోవు రోజుల్లో కూడా సంస్కరణలు చేపడతాము. ఇక్కడ పోలీసులున్నారు.ఇక్కడ వైకాపా అల్లరి మూకలు లేరు కాబట్టి ప్రశాంతంగా ఉంది.కానీ పోలీసుల్ని తనపై పురిగొల్పుతున్నారు. పోనీ వారికి ఇవ్వాల్సిన వెసులుబాట్లు కల్పించారా? అని ప్రశ్నించారు. పోలీసులంటే తనకు ఎంతో గౌరవం అని చంద్రబాబునాయుడు ప్రసంశించారు.

## భగవంతుని సేవకుడిగా "భూమన"

-టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్‌గా మరోసారి భాగ్యం
-ఎల్లుండి ఛైర్మన్ సుబ్బారెడ్డి పదవీకాలం ముగింపు
-కొత్త బోర్డు ఏర్పాటు దిశగా అడుగులు



తిరుమల,ఆగస్టు 5ప్రభాతవార్తప్రతినిధి:

దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వర స్వామి సేవకుడిగా భక్తులకు సేవలందించేందుకు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి అరుదైన అవకాశం లభించింది. గతంలో ఆయన 2006వ సంవత్సరం నుంచి 2008వరకు అప్పటి రాష్ట్రముఖ్యమంత్రి(ప్రస్తుత సిఎం వైఎస్ జగన్‌తండ్రి) వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో తొలిసారిగా టిటిడి ఛైర్మన్ బాధ్యతలు నిర్వహించారు. మళ్ళీ ప్రస్తుత సిఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో భూమన టిటిడి ఛైర్మన్‌గా రెండవసారి భాగ్యం కలిగింది. ప్రస్తుతం కొనసాగుతున్న టిటిడి బోర్డు పదవీకాలం మంగళవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో సోమవారం తిరుమలలో జరగనున్న ధర్మకర్తలమండలి చివరి సమావేశం కొన్ని అజెండాలతోనే ముగియనుంది. ఆ తరువాత 35మంది సభ్యులున్న బోర్డు మంగళవారం పూర్తిగా రద్దవుతుంది. ఛైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో నూతన ధర్మకర్తలమండలి పూర్తిస్థాయిలో ఏర్పాటుకావలసి ఉంది. పలువురు ఆవావహులు ఇప్పటికే తమతమ స్థాయిల్లో బోర్డు సభ్యులుగా నియామకం అయ్యేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. అయితే రానున్న 2024 ఎన్నికల నేపథ్యంలో మళ్ళీ వైసిపి అధికారంచేజిక్కించుకునే దిశగా వేస్తున్న అడుగుల్లో ఈ సారి అధికశాతం రాష్ట్రానికి చెందిన పలువురు పార్టీ నేతలకే బోర్డుసభ్యులుగా అవకాశం దక్కే సూచనలు ఉన్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌ను కలసి తనకు టిటిడి బోర్డు ఛైర్మన్‌గా అవకాశం కల్పించాలని కరుణాకర్‌రెడ్డి గట్టిగా కోరారు. అంతేగాక రాజకీయాలకు ఇక స్వస్తిపలుకుతున్నట్లు కూడా ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో భగవంతుని సేవాభాగ్యం కల్పించారు. 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పాటయిన తరువాత జగన్ బాబాయి వైవి సుబ్బారెడ్డికి టిటిడి బోర్డు పగ్గాలు అప్పగించారు. ఆ తరువాత రెండవసారి 2021లో మళ్ళీ సుబ్బారెడ్డికే టిటిడి ఛైర్మన్ పదవి దక్కింది. మంగళవారంలో ముగుస్తున్న పదవీకాలంతో సుబ్బారెడ్డి స్థానంలో కరుణాకర్‌రెడ్డికి మహత్తర భాగ్యం లభించింది. అయితే విధేయత, విశ్వసనీయత కరుణాకర్‌రెడ్డికి కలసి వచ్చాయి. టిటిడి ధర్మకర్తలమండలిలో రెండవసారి ఛైర్మన్‌గా సేవలందించనున్నారు. ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు వెలువడటంతో పలువురు అభిమానులు, వైసిపి నేతలు, కార్యకర్తలు, తిరుపతి నగర వాసులు భూమన ఇంటికి చేరుకుని అభినందనలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం టిటిడి ఛైర్మన్‌గా నియమితులు కావడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఏర్పాటుకానున్న కొత్త బోర్డు భక్తులకోసం తీసుకోనున్న సంక్షేమ కార్యక్రమాలు ఎలా ఉంటాయనేది చర్చ మొదలైంది. రానున్న దేవుని రెండు బ్రహ్మోత్సవాలు ఛైర్మన్ హోదాలో భూమన కరుణాకర్‌రెడ్డి సారధ్యంలో జరగనూన్నాయి.

## ఫ్లెక్సీల లొల్లి: తిరగబడ్డ దేశం తమ్ముళ్ళు



శ్రీకాళహస్తి,ఆగస్టు 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో శనివారం తెలుగుదేశం అధినేత నారాచంద్రబాబునాయుడు రోడ్‌షో బహిరంగ సభ రెండు రోజుల పాటు ఉద్రిక్తత వాతావరణంలో సాగింది. చంద్రబాబునాయుడు రోడ్‌షో సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సారధ్యంలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు. నాలుగుమాడా వీధుల్లో పచ్చదనాన్ని పరచారు. అయితే సభావేదిక బేరివారి మండపం వద్ద ఏర్పాటు చేసిన 'సైకో పోవాలి: సైకిల్ రావాలి'అనే నినాదంతో ఉన్న ఫ్లెక్సీని తొలగించాలని అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో బేరివారి మండపం వద్ద ఫ్లెక్సీలను తొలగిం చుటకు మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు వారి సహాచరులు ప్రయత్నించారు.దాంతో మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ చెంచయ్య నాయుడు ఎందుకు తీయాలని నిలదీశారు. వివాదాస్పద వ్యాఖ్యను తొలగించుటకు అధికారులు ప్రయత్నించారు.

## కంటైనర్ లారీలో మంటలు... పరుగులు తీసిన ప్రజలు



రేణిగుంట, ఆగస్టు 5 ప్రభాతవార్త:

రేణిగుంట మరణ విలాస్ సర్కిల్ వద్ద శనివారం మధ్యాహ్నం కంటైనర్ లారీలో మంటలు చెలరేగడంతో జనం భయంతో పరుగులు తీశారు. పాత చెక్‌పోస్టు వద్ద రాష్ట్ర ప్రతిపక్ష నేత, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కార్యక్రమం జరగడంతో ఎవరైనా ఆందోళన కారులు నిప్పు పెట్టారా.. అన్న అనుమానాలు రేకెత్తాయి. లారీ ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బెంగలూరు నుంచి ఒరిస్సాకు కార్ల లోడుతో వెళుతున్న కంటైనర్ ఇంజన్‌లో పొగలతో కూడిన మంటలు వ్యాపించాయి. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి లారీని ఆపేశాడు. సెల్ఫ్ మోటారు లేదా చార్జింగ్ డైనమో వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపించినట్లు డ్రైవర్ తెలిపారు. ఇంజన్ పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. వెనుక కంటైనర్‌లో ఉన్న ఓ కారు ముందు భాగం కాలింది. రెండు అగ్నిమాపక యంత్రాలు మంటలను అదుపు చేశాయి. రేణిగుంట అర్బన్ సీఐ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసులను పరామర్శించిన మంత్రి పెద్దిరెడ్డి, డిప్యూటీ సిఎం



చిత్తూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులను పరామర్శిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సిఎం నారాయణస్వామి

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త:

చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న పోలీసు అధికారులు, పోలీసులను శనివారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు.డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఎపిఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డినిమంత్రి పెద్దిరెడ్డి మాట్లా డుతూ పుంగనూరులో పోలీసులపై జరిగిన దాడి ఘటన బాధాకం మని, గాయపడిన పోలీసులు త్వరగా కోలుకొనేవిధంగా అవసరమైన వైద్య సేవలు అందించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆసుపత్రి వైద్యాధికారులను కోరారు. వెంట కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబులు, మేయర్ అముద, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ నాయక్, ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్, అపోలో ఆసుపత్రి యూనిట్ ఇన్‌ఛార్జీ నరేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అంతరిక్షంలో అద్భుతం

జాబిలి కక్ష్యలోకి చేరిన చంద్రయాన్-3 - ఇక చంద్రునిపై దిగడమే మిగిలింది
లక్షల కిలోమీటర్ల దూరం అధిగమించి చంద్రుని వైపు క్షేమంగా వెళ్లిన చంద్రయాన్-3






శ్రీహరికోట (తడ), ఆగస్టు 5 ప్రభాతవార్త

అంతరిక్షంలో మరో అద్భుతం చోటుచేసుకుంది. జాబిలి పరిశోధనలకు ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 లక్షల కిలోమీటర్లు అధిగమించి చంద్రుని కక్ష్యలో ప్రవేశించింది. శనివారం రాత్రి 7.15 గంటలకు చంద్ర కక్ష్యలో ప్రవేశించిన క్షణం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు ఉత్సాహంతో ఆ దృశ్యాలను వీక్షించారు. బెంగళూరులోని ఇస్రోకు చెందిన టెలిమెట్రి అండ్ టెలికమాండ్ ట్రాకింగ్ కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు చంద్రయాన్-3ని నియంత్రించారు. చంద్రుని పరిశోధనల కోసం భారత శాస్త్రవేత్తలు రూపొందించి ప్రయోగించిన మూడవ ఉపగ్రహం ఇది. జూలై 14న శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఎల్‌విఎం3 ఎం4 రాకెట్ ద్వారా అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టిన చంద్రయాన్-3 అప్పటి నుంచి అంచలంచెలుగా చంద్రుని వైపు దూసుకెళ్లింది. చంద్రయాన్-3లోని ద్రవ ఇంధన ఇంజన్‌ను భూకేంద్రాల నుంచి ఎప్పటికప్పుడు మండిస్తూ రైజింగ్ ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసిన శాస్త్రవేత్తలు శనివారం సాయంత్రం వరకు దాన్ని సక్రమమైన మార్గంలోనే మళ్లించారు. ఈ నెల 1న తెల్లవారుజామున భూమి చుట్టూ ప్రదక్షణలు పూర్తి చేసుకొని చంద్రుని వైపు మళ్లిన చంద్రయాన్-3 మూడు లక్షల కిలోమీటర్లకు పైగా ప్రయాణించింది. ట్రాన్స్ లూనార్ ఇంజక్షన్ (టిఎల్ఐ) అనే ప్రక్రియ ద్వారా చంద్రయాన్-3ని జాబిలికి చేరుకునే మార్గం (లూనార్ ట్రాన్స్‌ఫర్ ట్రాజెక్టరీ) లోకి ఐదురోజుల క్రితం ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి అది జాబిలి దిశగా పయనించి శనివారం సాయంత్రానికి శాస్త్రవేత్తల నమ్మకానికి అనుగుణంగా చంద్రుని కక్ష్యలో చేరింది. లూనార్ ఆర్బిట్ ఇంజక్షన్ (ఎల్ఓఐ) అనే ప్రక్రియతో ఇస్రో చంద్రయాన్-3ని జాబిలి కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.

**ఈ నెల 23న జాబిలి దక్షిణ ధ్రువంపైకి...**

చంద్రయాన్-3 ఇక జాబిలి దక్షిణ ధ్రువంపైకి దిగి పరిశోధనలు చేయడమే మిగిలింది. ప్రస్తుతం చంద్ర కక్ష్యలో చేరిన చంద్రయాన్-3 చంద్రునికి దూరం నుంచి ప్రదక్షణలు ప్రారంభించి క్రమేణా దగ్గరగా ప్రదక్షణలు చేసి స్థాయికి చేరుతుంది. ఈ నెల 17న చంద్రునికి అత్యంత సమీప కక్ష్యలో అంటే కేవలం 100 కిలోమీటర్ల సర్కిల్‌లో పరిభ్రమిస్తుంది. అనంతరం ఈ నెల 23న చంద్రుని దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ అయితే అమెరికా, రష్యా, చైనాల తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగవ దేశంగా భారత్ అవతరిస్తుంది. చంద్రునిపై దిగిన చంద్రయాన్-3లోని రోవర్, ల్యాండర్‌లు ఒక లూనార్‌డే (అంటే మన 14 రోజులతో సమానం) చంద్రునిపై పరిశోధనలు చేసి భూ కేంద్రాల్లోని శాస్త్రవేత్తలకు సమాచారం అందిస్తుంది. దీనికోసమే భారత శాస్త్రవేత్తలు రేయింబవళ్లు కళ్లల్లో ఒత్తులేసుకొని ఎదురు చూస్తున్నారు.

## పోలీసులపై 'దేశం' శ్రేణుల దాడులకు నిరసనగా..

# బంద్ ప్రశాంతం



గుడిపాలలో బంద్ నిర్వహిస్తున్న వైకాపా నాయకులు.



పాలసముద్రం మండలంలో బంద్



చిత్తూరులో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వైకాపా నాయకుల నిరసన ర్యాలీ.

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త: పుంగనూరులో శుక్రవారం ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా తెలుగుదేశం శ్రేణులు పోలీసులపై నిర్వహించిన దాడులకు నిరసనగా అధికార వైకాపా పిలుపు మేరకు జిల్లాలో శనివారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా పరిధిలోని చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, పలమనేరు, నగరి, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు దుకాణాలు మూసి వేయగా వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జిల్లా కేంద్రం చిత్తూరులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డిలు వేరు వేరుగా ర్యాలీలు నిర్వహిస్తూ బంద్‌ను పర్యవేక్షించారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి చిత్తూరు నగరంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు అన్బు, వైకాపా కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉదయం 6 గంటలకే రోడ్లపై చేరుకొన్న నాయకులు, కార్యకర్తలు బస్టాండ్‌ల నుండి బస్సులు బయటికి వెళ్ళకుండా అడ్డుకొన్నారు. అలాగే బస్టాండ్ నుండి వెళ్ళిన బస్సులను నాయకులు, కార్యకర్తలు ఎక్కడ పడితే అక్కడ నిలిపి వేశారు. ఆర్టీసీ అధికారులు బస్సులను శనివారం డిపోలకే పరిమితం చేశారు. ఆర్టీసీ శనివారం సాయంత్రం పైబడి బస్సు సర్వీసులను పట్టణాలు, గ్రామాలకు నడిపింది. ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో బంద్ పురస్కరించుకొని ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలు పోటా పోటీగా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఓ వైపు వైకాపా నాయకులు పోలీసులపై దాడిని నిరసిస్తూ నిరసన ప్రదర్శన చేయగా మరోవైపు తెలుగుదేశం నాయకులు న్యాయం చేయాలని కోరుతూ నిరసనకు దిగారు. అలాగే పూతలపట్టులో సైతం ఇరు పార్టీలు పోటా పోటీగా నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఓ వైపు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు చేపట్టగా, మరోవైపు తెలుగుదేశం పార్టీ నాయకలు, కార్యకర్తలు పోటీ నిరసన ప్రదర్శన నిర్వహించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మండల కేంద్రం యాదమరిలో జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు బస్సులు, వాహనాల రాకపోకలను నాయకులు, కార్యకర్తలు పూర్తిగా నిలిపివేశారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో మధ్యాహ్నం 12 గంటలకు పైబడి బస్సులు, లారీలు కదిలాయి.

## కుప్పంలో బంద్ ప్రశాంతం.. ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం

- మూతపడ్డ దుకాణాలు.. పర్యవేక్షించిన వైకాపా శ్రేణులు !!



కుప్పంరూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త

కుప్పంలో శనివారం అధికార వైకాపా తలపెట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచే దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు మూతపడ్డాయి. ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కుప్పం నుంచి తిరుమలకు ప్రయాణీకులతో బయలుదేరిన బస్సు అద్దాలు పగలగొట్టారు. కాగా శనివారం ఉదయం నుంచే ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఏఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ తదితరులు బంద్‌ను పర్యవేక్షించారు. రోడ్లలో టైర్లు వేసి వైకాపా శ్రేణులు కాల్చారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబు వైఖరితోనే పుంగనూరు, అంగళ్లలో ఘర్షణలు చెలరేగాయని ఇందుకు చంద్రబాబే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బంద్‌కు సహకరించారన్నారు. మండలంలోని మల్లానూరులో కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, ఎంపిపి అశ్వినిల పర్యవేక్షణలో బంద్ జరిగింది. ఇదిలా ఉండగా బంద్ సందర్భంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడలేదు.

## పెద్దపంజాణిలో బంద్ ప్రశాంతం

పెద్దపంజాణి ఆగస్టు 5 ప్రభాతవార్త :



జిల్లా వైఎస్సార్‌సిపి అధిష్టానం ఆదేశాలమేరకు శనివారం మండలంలో వైకాపా శ్రేణులు చేపట్టిన బంద్ విజయవంత మైంది. ఉదయం నుంచే చెన్నై-ముంబై జాతీయ రహదా హరిలో బస్సు లు, లారీలు, ఆటోలు, కార్లు పలువాహనాలు భారీసంఖ్యలో రోడ్డుపై నిలిచిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు, ప్రయివేట్ కార్యాలయాలు మూతపడ్డాయి. వైకాపా శ్రేనులు బంద్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్బంగా మండల వైకాపా కన్వీనర్ బాగారెడ్డి, ఎంపిపి రెడ్డెప్ప మాట్లాడుతూ.. పుంగనూరులో శుక్రవారం జరిగిన సంఘటనకు మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు బాధ్యత వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు జి.డి.బాబు, అంజమ్మ, సింగిల్ విండో అధ్యక్షులు సంపల్లి బాబు, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమీషన్ సెల్ అధ్యక్షులు యస్.ఆంజప్ప, వైకాపా జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, ఏఎంసి డైరక్టర్ సురేష్, వైకాపా మండల సోషల్ మీడియా కన్వీనర్ బాలాజి, మండల కో ఆప్షన్ మెంబర్ రహంతుల్లా, సర్పంచులు హరినాథ్, అఖిలాజాఫర్, పగడాల మురళి, రమేష్‌బాబు, స్వర్ణలత, ఫజుల్లాలతీఫ్. రవికుమార్, బార్గవ్, ఎంపిటిసి సభ్యులు సుబ్రమణ్యం, గురుమూర్తి, మార్కొండప్ప, నేతలు రాజారెడ్డి, రమణారెడ్డి, సన్నపరెడ్డి, సతీష్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, అబ్బాస్, ఇమ్రాన్‌ఖాన్, రాజగోపాల్, శ్రీరాములు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుడిపాలలో బంద్

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త:

పుంగనూరులో తెలుగుదేశం శ్రేణులు పోలీసులపై నిర్వహించిన దాడులను నిరసిస్తూ శనివారం వైకాపా పిలుపు మేరకు నిర్వహించిన బంద్ గుడిపాల మండలంలో విజయవంతం అయ్యింది. చిత్తూరు వైకాపా నాయకులు భూపేష్ గోపినాథ్, ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్యలు బంద్‌ను పర్యవేక్షించారు. జాతీయ రహదారిలో నరహరిపేట సమీపంలో వాహనాలను పూర్తిగా నిలుపుదల చేయడంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎంపిపి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు గుడిపాలలో దుకాణాలు మూయించి నిరసన వ్యక్తం చేశారు.

యాదమరిలో...

పుంగనూరులో పోలీసులపై తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన దాడులను నిరసిస్తూ శనివారం వైకాపా ఇచ్చిన బంద్ పిలుపు యాదమరి మండలంలో విజయవంతం అయ్యింది. వైకాపా నాయకులు, కార్యకర్తలు శనివారం తెల్లవారుజాము నుండి రోడ్లపై తిరిగే వాహనాలను నిలుపుదల చేశారు. జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి పర్యవేక్షణలో ఎంపిపి సురేష్, మాజీ జడ్పీటిసీ మనోహరన్, నాయకులు మనోహర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బంద్ జరిగింది. మధ్యాహ్నం వరకు సాఫీగా బంద్ సాఫీగా జరిగినా ఆపై పోలీసులు కల్పించుకొని వాహనాలను వదలిపెట్టారు. దుకాణాలు మాత్రం శనివారం సాయంత్రం వరకు యాదమరిలో మూతపడ్డాయి.

పాలసముద్రంలో...

పాలసముద్రం మండలంలో శుక్రవారం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పుంగనూరులో పోలీలపై నిర్వహించిన దాడికి నిరసనగా శనివారం వైకాపా ఇచ్చిన బంద్ పిలుపు మేరకు మండలంలో బంద్ విజయవంతం అయ్యింది. వైకాపా నాయకులు శనివారం ఉదయం 6 గంటల నుండి బంద్‌ను పర్యవేక్షించారు. పాలసముద్రం గుండుబావి కూడలి వద్ద వైస్ ఎంపిపి శేఖర్ మందడి ఆధ్వర్యంలో వైకాపా నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దుకాణదారులు స్వచ్ఛంధంగా దుకాణాలు మూసి వేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు పోలయ్య, గోవిందరాజులు, వరదరాజులు, ధనంజయ, శరవణ, షణ్ముగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతిపురంలో బంద్ ప్రశాంతం

శాంతిపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త:

శాంతిపురం మండలంలో వైకాపా నేతలు చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. కుప్పం - పలమనేరు జాతీయ రహదారిపై టైర్లు వేసి నిప్పంటించి బంద్ పాటించారు. దీంతో వాహనాలు భారీగా ఆగిపోయాయి. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ తనకు రక్షణ కల్పిస్తోంది పోలీసులు అన్న విషయం మరచి పోలీసులపై కార్యకర్తలను రెచ్చగొట్టడం దారుణమన్నారు. కుప్పంలో జరుగుతున్నది సైకిల్ ర్యాలీ కాదని సైకో ర్యాలీ అన్నారు. కార్యక్రమాల్లో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధరకోదండరెడ్డి, నేతలు చక్రపాణిరెడ్డి, పెద్దన్న, దండపాణి, ఎవి జయరాం, మునిరత్నం, చెంగప్ప, కేశవులు, రమేష్, భాస్కర్, జగదీష్‌నాయుడు పాల్గొన్నారు.

**వి.కోట :**

వి.కోటలో శనివారం వైకాపా నేతలు నిర్వహించిన బంద్ విజయవంతమైంది. జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, రాష్ట్ర నేతలు పిఎన్ నాగరాజు, బాలగురునాథ్, ఎంపిపి యువరాజు, వైస్ ఎంపిపిలు తమీమ్, లక్ష్మణ్‌రెడ్డి, స్థానిక నేతలు అంబేద్కర్ కూడలిలో బైఠాయించి నిరసన తెలిపారు. బంద్ కారణంగా జాతీయ రహదారిలో భారీగా వాహనాలు ఆగిపోయాయి.

## తవణంపల్లెలో వైకాపా బంద్ ప్రశాంతం

తవణంపల్లె, ఆగస్టు 5 ప్రభాతవార్త:



పుంగనూరు ఘటనకు నిరసనగా వైకాపా పిలుపు మేరకు శనివారం జరిగిన జిల్లా బంద్ తవణంపల్లె మండలంలో ప్రశాంతంగా జరిగింది. మండల వైకాపా కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలో వైకాపా నాయకులు బంద్ నిర్వహించారు. ఈసందర్బంగా ఐరాల క్రాస్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్దం చేశారు. అలాగే రోడ్డుపై మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈనిరసన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈమేరకు అరగొండ-చిత్తూరు, ఐరాల-చిత్తూరు రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. బంద్ సందర్బంగా ఉదయం నుండి సాయంత్రం వరకు ఆర్టీసీ, ప్రయివేటు బస్సులు పూర్తిగా నిలిచిపోగా ఆటోలు మాత్రం యథావిధిగా నడిచాయి. ఈకార్యక్రమంలో మండల వైకాపా నాయకులు సరకల్లు హరిరెడ్డి, తడకర మధుకుమార్, పట న్ం బాబురెడ్డి, సుకేష్‌రెడ్డి, గాంధీబాబు, సురేష్‌బాబురెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, అరగొండ కిషోర్‌కుమార్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, సందీప్‌రెడ్డి, ఐరాల ధనంజయరెడ్డి, కోదండ, పరమేశ్వరరెడ్డి, రమణారెడ్డి, డేవిడ్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐరాలలో వైకాపా బంద్ ప్రశాంతం

ఐరాల, ఆగస్టు 5 ప్రభాతవార్త:

పుంగనూరు ఘటనకు నిరసనగా వైకాపా పిలుపు మేరకు శనివారం జరిగిన జిల్లా బంద్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. ఈసందర్బంగా మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ చింతం మోహన్‌ల ఆధ్వర్యంలో మండల కేంద్రం ఐరాలలో బంద్ నిర్వహించారు. ఈసందర్బంగా ఐరాలలో దుకాణాలను మూయించి వేసి నిరసన ర్యాలీ నిర్వహించారు. అలాగే వైఎస్.గేట్, పాటూరు తదితర ప్రాంతాల్లో కూడా స్థానిక నాయకుల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈమేరకు మండలంలో ఉదయం నుండి సాయంత్రం వరకు బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈకార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనచంద్రారెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, రవిరెడ్డి, లోకనాధరెడ్డిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయాన్ని సందర్శించాలని చాగంటికి ఆహ్వానం

కాణిపాకం, ఆగస్టు 5 ప్రభాతవార్త:



సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి ఆలయాన్ని సందర్శించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు ఆలయ అధికారులు శనివారం ఆహ్ వ్వనం పలికారు. ఆలయ ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు, వేదపండితులు చాగంటి కోటేశ్వరరావును కాకినాడలోని ఆయన స్వగృహంలో కలసి కాణిపాకం ఆలయ సందర్శనార్థం రావాలని ఆహ్వానించారు. ఈసందర్బంగా ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని అవహేళన చేస్తారా - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త



రాష్ట్రంలో డా॥ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని వైకాపా నేతలు అవహేళన చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులు చూస్తే ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక రాజరిక వ్యవస్థలో ఉన్నామా అని అన్పిస్తోందన్నారు. అధికార పార్టీ నేతలే బంద్‌కు పిలుపునివ్వడం హాస్యాస్పదమన్నారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు కర్నూలు, కడప, అనంతజిల్లాల్లో పర్యటిస్తే అక్కడ ఏమీ జరగదని పుంగనూరు, అంగళ్లలో ఎందుకు దాడులు చేశారనే విషయం ప్రజలు గమనిస్తున్నారన్నారు. యువనేత నారా లోకేష్ యాత్రకు సైతం అడ్డు తగిలారన్నారు. కుప్పంలో సైతం తెదేపా నేతలపై అక్రమ కేసులు బనాయించారన్నారు. గతంలో తమ అధినేత కుప్పం పర్యటనకు వస్తే ఆసమయంలో వైకాపా నేతలు అన్న క్యాంటీన్ ధ్వంసం చేశారని పేర్కొన్నారు. పరదాలు కట్టుకుని తిరుగుతోంది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. సమావేశంలో నేతలు విశ్వనాథనాయుడు, ఉదయ్‌కుమార్, ఎల్.జయరాంరెడ్డి, మణి, రమేష్, నాగరాజు, బాలు, జైపాల్, భాస్కర్, చంద్రకళ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాణిపాకంలో వైకాపా పోటాపోటీ బంద్

కాణిపాకం, ఆగస్టు 5 ప్రభాతవార్త:



పుంగనూరు ఘటనకు నిరసనగా వైకాపా పిలుపు మేరకు శనివారం జరిగిన జిల్లా బంద్ కాణిపాకంలో ఇరువర్గాలకు చెందిన వైకాపా నాయకులు పోటా పోటీగా నిర్వహించారు. ఈసందర్బంగా కాణిపాకం ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన వర్గీయులు, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్‌ల ఆధ్వర యంలో వారి వర్గీయులు కాణిపాకంలో బంద్ నిర్వహించారు. ఈసందర్బంగా సర్పంచ్, ఎంపీటీసీల ఆధ్వర్యంలో స్థానిక నాయకులు రవిచంద్రారెడ్డి, చిన్నారెడ్డి, సురేష్‌రెడ్డి, మూర్తి, ప్రభాకర్, భాస్కరయ్యలతో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు అగరంపల్లె, కాణిపాకంలలో దుకాణాలు, పాఠశాలలను మూసి వేయించి నిరసన వ్యక్తం చేశారు. అలాగే ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు చరణ్‌రెడ్డి, గోపీనాధన్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు అగరంపల్లె కూడలిలో నల్లబ్యాడ్జీలు ధరించి బైఠాయించి చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఒకే చోట వర్గ విభేదాలతో వైకాపా నాయకులు వేర్వేరుగా బంద్ కార్యక్రమాలు నిర్వహించడంతో వారి మధ్య అంతర్గతంగా వున్న విభేదాలు బట్టబయలయ్యాయి.

## బంద్ పేరిట అరాచకం

- తెలుగుదేశం నాయకులు ధ్వజం

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త:

బంద్ పేరిట అధికార వైకాపా నాయకులు అమర్‌రాజా వాహనం, సిబ్బందిపై దాడి, అరాచకంకు పాల్పడ్డారని తెలుగుదేశం నాయకులు ధ్వసమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం దేశం నాయకులు మోహన్‌రాజ్, సప్తగిరిప్రసాద్‌లు మాట్లాడుతూ వైకాపా ఇచ్చిన బంద్ పిలుపుకు ప్రజల నుండి స్పందన లేకపోవడంతో వైకాపా అల్లరి మూకలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. చిత్తూరు జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంత్రి వర్గం నుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

## పోలీసులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు

- పాలసముద్రం ఎంపిపి శ్యామల శివప్రకాష్‌రాజు

పాలసముద్రం, ఆగస్టు 5 ప్రభాతవార్త:



పుంగనూరులో శుక్రవారం పోలీసులపై తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు జరిపిన దాడికి బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పాలసముద్రం ఎంపిపి శ్యామల శివప్రకాష్‌రాజులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆమె శనివారం మాట్లాడుతూ ఓటమి భయంతోనే తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు. పోలీసులపై దాడి చేయడం, పోలీసు వాహనాలను ధ్వంసం చేయడం తెలుగుదేశం నాయకులు పక్కా ప్రణాళికతో చేపట్టారని ఆమె పేర్కొన్నారు. పుంగనూరులో జరిగిన దాడుల్లో పాలసముద్రం ఎస్ఐ ప్రసాద్ సైతం గాయపడ్డారని ఆయన త్వరగా కోలుకొని విధుల్లో చేరాని ఆమె ఆకాంక్షించారు.

## డా॥సురేష్‌బాబుచే పెద్ద ఎత్తున అన్నదానం

కుప్పంరూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త

తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కుప్పం తెదేపా విస్తరణ కమిటీ అధ్యక్షుడు డా॥ బిఆర్ సురేష్‌బాబు అధ్వర్యంలో శనివారం కుప్పంలో పెద్ద ఎత్తున అన న్దానం చేశారు. స్థానిక అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు ఆహారం అందించారు. కార్యక్రమంలో నేతలు బిఎంకె రవిచంద్ర, నాను, ఆర్ఆర్ రవి, సర్దార్, పిఎస్ సతీష్, మునెప్ప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదరణ తట్టుకోలేకనే చంద్రబాబుపై దాడులు

కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త



ప్రతిపక్ష నేత, తెదేపా అధినేత చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఎక్కడా తిరగకూడదా అని మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, మాజీ ఎంపిపి సాంబశివంలు ప్రశ్నించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్ర బాబుకు పులివెందులలో సైతం జనం బ్రహ్మరథం పట్టారనే విషయం జీర్ణించుకోలేక వైకాపా శ్రేణులు తెదేపా అధినేతపై దాడులకు తెగబడడం దారుణమన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## విజయదశమికి టిడ్కో గృహాలు లబ్దిదారులకు ఇస్తాం

- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, ఆగస్టు 5, ప్రభాతవార్త:



టిడ్కో గృహాలను అక్టోబరు 24 విజయదశమి నాటికి లబ్దిదారులకు గృహప్రవేశాలు చేయిస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 17వ వార్డు చాకలి వీధి, తూర్పు వీధులలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. టిడ్కో గృహాలు ఇవ్వనందు వలన బాడుగ ఇళ్లలో ఉంటూ బాడుగ కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న స్థానికులు చెప్పడంతో ఆయన అక్టోబరు నెలలో ఇప్పిస్తామని తెలిపారు. టిడ్కో గృహాల పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. పూర్తయిన గృహాలు అన్నింటినీ లబ్దిదారులకు ఇస్తామన్నారు. పేదల సంక్షేమమమే సీఎం జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. సంక్షేమ పథకాలను లబ్దిదారులకు నేరుగా అందజేస్తున్నామన్నారు. స్థానికులు చెప్పిన పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఆయన వెంట ఛైర్‌పర్సన్ నక్క భానుప్రియ, వైస్ ఛైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు పూజారి లక్ష్మీ, ధనియాల రాధా, జానకిరామయ్య, శ్రీనివాసులు, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, నాయకులు బ్రహ్మయ్య, మురళీకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతా మోహన్

వెంకటగిరి, ఆగస్టు 5, ప్రభాతవార్త:



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వం వలన నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నా యని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతా మోహన్ తెలిపారు. వెంకటగిరి పట్టణం ధర్మపురం, బొగ్గులమిట్ట, చింతగుంట, కాంపాళెంలలో ఆయన ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. నిత్యవసర సరుకుల ధరలు పెరగడం వలన పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బెల్ ఫ్యాక్టరీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపివేసినట్లు తెలిపారు. దుగరాజపట్నం ఓడరేవు పనులను ప్రారంభించాలని కోరారు. వైసీపీ, బీజేపీతో అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. రాపూరు - ఏర్పేడు మధ్యలో రాజధాని ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీనియోజకవర్గ ఇన్‌చార్జ్ పంట శ్రీనివాసులురెడ్డి, నాయకులు శ్రీనివాసులు, గోపి తదితరులు ఉన్నారు.

## గంజాయి స్వాధీనం: నిందితుడు అరెస్ట్

వెంకటగిరి, ఆగస్టు 5, ప్రభాతవార్త:



స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద గంజాయి తీసుకొనివెళుతున్న నిందితుడిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ అధికారులు తెలిపారు. 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని బీహార్‌కు చెందిన జైవిన్ జోసఫ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడు తిరుపతికి గంజాయి తరలిస్తే అక్కడి నుండి కేరళకు మరొకటి తీసుకుని వెళతారని ఎస్ఈబీ అధికారులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం స్థానిక కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

## రాత్రిళ్లు విద్యుత్ కోతపై ప్రజల ఆగ్రహం

కోట, ఆగస్టు 5 ప్రభాతవార్త

ఒక పక్క ఉక్కపోత. మరో పక్క దోమల బెడదతో మండలంలోని ప్రజలు కంటిపై కునుకు లేకుండా అల్లాడుతున్నారు. గత వారంరోజుల నుంచి మండలంలో రాత్రిపూట విద్యుత్ శాఖ అధికారులు కోత విధిస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు విద్యుత్ కోతలతో అల్లాడిపోతున్నారు. రాత్రి సమయంలోనే ఎందుకు కోత విధిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇష్టానుసారంగా రాత్రి సమయంలో ఐదారు సార్లు అనధికారికంగా కోత విధించడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని రాత్రి వేళ నిరంతరాయంగా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## పోలేరమ్మ భక్తులకు 365 రోజులు ప్రసాదాలు పెడతా

- డాక్టర్ మస్తాన్ యాదవ్

వెంకటగిరి, ఆగస్టు 5, ప్రభాతవార్త:



వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించే భక్తులకు 365 రోజులు ప్రసాదాలు అందజేస్తానని డాక్టర్ మస్తాన్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్ తెలిపారు. పోలేరమ్మ ఆలయంలో ఆయన పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పోలేరమ్మ భక్తులకు ప్రసాదాలు పెట్టాలనే కోరిక ఎప్పటినుంచో ఉందని, ఇప్పుడు తీరిందన్నారు. వెంకటగిరి ప్రాంత ప్రజలను కాపాడే అమ్మవారు పోలేరమ్మ అని తెలిపారు. పోలేరమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు మురళీనాయుడు, రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

## కోటలో ఐక్యత విజయపథం యాత్ర

కోట, ఆగస్టు 5 ప్రభాతవార్త



మండల కేంద్రమైన కోటలో శనివారం రిటైర్డ్ ఐఎఎస్ అధికారి విజయకుమార్ ఐక్యత విజయపథం యాత్ర నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పేదరికం నుంచి పేద జన విముక్తే ధ్యేయంగా ఐకమత్యమే లక్ష్యంగా ఒక పవిత్రమైన ఆశయంతో ఐక్యత విజయపథం యాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సమాజంలో పేదరికం బహు రూపాల్లో ఇమిడి ఉందన్నారు. తరాలు మారినా అంతరాలు మారలేదన్నారు. ఐఎఎస్ అధికారిగా మూడు దశాబ్దాలకు పైబడి కులమత ప్రాంతాలకు అతీతంగా మానవ సేవే లక్ష్యంగా పనిచేశానన్నారు. పలు జిల్లాలలో కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా, ఇతర పదవుల్లో సమర్థత, నిబద్ధతతో పేదలకు సేవ చేశానని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు అండదండగా నిలిచే గుండె కలిగిన వ్యక్తిగా తాను ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, నిర్భయంగా ఓటు వేసుకోవడం, రికార్డు స్థాయిలో ఇంటి పట్టాలు, వ్యవసాయ కూలీలను భూయజమానులుగా చేయడం, లక్షల మంది నిరక్షరాస్యులలో అక్షర జ్యోతిని వెలిగించడం, వేలాది మంది విద్యావంతులైన నిరుద్యోగ యువతకు సుస్థిర ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ యాత్రలో ఇందిర క్రాంతిపథం ఉద్యోగులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల వర్క్ టు రూల్

కోట, ఆగస్టు 5 ప్రభాతవార్త

సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ ఉద్యోగులు దశలవారీ ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. విద్యుత్ ఉద్యోగుల జెఏసి ఆధ్వర్యంలో జూలై 27 నుంచి వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. శనివారం నుంచి నిబంధనల మేరకు పని చేయాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయి ఉద్యోగులు మూడురోజులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు మాత్రమే విధులు నిర్వహిస్తారు. కార్యాలయాల్లో పనిచేసే వారు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారు. ఈ సమయాల్లో మాత్రమే వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని జెఏసి నాయకులు కోరారు.

## ఓటమి భయంతోనే వైకాపా దాడులు

కోట, ఆగస్టు 5 ప్రభాతవార్త

చిత్తూరు జిల్లా పుంగనూరులో తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడి వాహన శ్రేణిపై వైకాపా శ్రేణులు దాడికి పాల్పడడాన్ని తిరుపతి జిల్లా బిసి సెల్ నాయకులు తీగల సురేష్‌బాబు, కోట పట్టణ తెదేపా అధ్యక్షులు షెక్.షంషద్దీన్‌లు ఖండించారు. వారు శనివారం విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనతో వైకాపా నేతలకు ఓటమి భయం పట్టకుందని వ్యాఖ్యానించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులే చంద్రబాబు వాహన శ్రేణిపై దాడికి పాల్పడి పార్టీ బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించారన్నారు. శాంతిభద్రతకు విఘాతం కలిగించేలా వైకాపా గూండాలు వ్యవహరించి కార్యకర్తలపై భౌతిక దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. చంద్రబాబు పర్యటనకు తగినంత బందోబస్తు కల్పించాలని వారు డిమాండు చేశారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండు చేశారు. రాష్ట్రంలో నియంతృత్వ విధానం ఆరాచకం, రాజ్యమేలుతోందన్నారు. పులివెందులలో చంద్రబాబు బహిరంగసభ విజయవంతం కావడంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు.

## తడ మండలంలో జగనన్న సురక్ష విజయవంతం

- ఎంపిడిఓ అమోస్‌బాబు

తడ, ఆగస్టు 5 ప్రభాతవార్త




తడ మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేశారని ఎంపిడిఓ కె.అమోస్‌బాబు తెలిపారు. శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో అభివృద్ధి పనులను ప్రస్తావించారు. ఈ సందర్బంగా సచివాలయాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డిఇ రమణయ్యను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇటీవల తమకు గడప గడపలోను, జగనన్న సురక్షలోను వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిష్కరించాలని ఎంపిడిఓ చెప్పారు. మండలాధ్యక్షుడు కొళవి రఘురెడ్డి, డిసిఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, మండల ఉపాధ్యక్షుడు కుప్పంపాటి వెంకటేష్, పలువురు అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తల్లి పాలే రక్షణ.. పోషణ

సిడిపిఓ ..మునికుమారి

కోట, ఆగస్టు 5ప్రభాతవార్త



అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో అవసరం, చిన్నారుల రక్షణ, పోషణకు దోహదం చేస్తాయని కోట ఐసీడిఎస్ ప్రాజెక్టు అధికారిణి మునికుమారి అన్నారు. తల్లిపాలు వారోత్స వాల్లో భాగంగా శనివారం మండల పరిధిలో వెంకన్న పాళెం గ్రామం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. పుష్కలమైన పోషకాలు రోగ నిరోధక శక్తి దాగి ఉంటుందన్నారు. తల్లిపాల వారోత్స వాలను పురస్కరించుకుని అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింఇకి వెళ్లి తల్లి పాల ప్రాముఖ్యతను వివుస్తున్నారని తెలిపారు. పిల్లల ఎదుగుదలకు అందించాల్సి న పోషకాలు, గర్భిణుల తీసుకోవాల్సి న ఆరోగ్య జాగ్రత్తలు బిలింతులకు తగినంత పోషకాహారం అందిచేలా కుటుంభ సభ్యులకు అవగాహన కల్పిచడం జరుగుతుందన్నారు. ఇంట్లోనే సమతుల ఆహారం ఎలా తయారు చేసుకోవాలో మహిళకు తెలియజేస్తున్నామన్నారు. తొలి ఆర్నెల్లు శిశువుకు తల్లి పాల్వివాలి, సంపూర్ణహారం చనుపాలు, ఉత్పత్తి బిడ్డ పాలు తాగడంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆర్నెల్ల వరకు తల్లి పాలే తాగడం వల్ల శిశు మరణాలు తగ్గుతాయన్నారు. పిల్లలు శారీరకంగా ,మానసికంగా అభివృద్ధి చెందుతారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్లు వైజర్లు కష్ణమ్మ, కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్ఎం.నిరోష, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## నాగిలేరులో సప్రవాహనంపై ఊరేగిన

ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి

నారాయణవనం, ఆగస్టు 5 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ది చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవా ల్లో భాగంగా రెండవరోజు శనివారం సాయంత్రం సప్రవాహ నంపై వెంటకృష్ణపాలెం పంచాయతీ నాగిలేరు గ్రామంలో ఘనంగా ఊరేగారు. అంతకుముందు ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, తోరణాలు, పచ్చనిమామిడి ఆకులతో అలంకరించారు. మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ ఘనంగా ఊరేగారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త టిఎస్.సొరకాయులురెడ్డి, మాజీ ధర్మకర్త దేశప్పరెడ్డి, నాగిలేరు గ్రామస్తులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

## ఆడికృత్తిక గోడపత్రికను ఆవిష్కరించిన డిప్యూటీ సిఎం

కార్వేటినగరం, ఆగస్టు 5 ప్రభాతవార్త:



కార్వేటినగరం శ్రీవళ్ళిదేవయాని సమేత సుబ్రమణ్యం స్వామి ఆలయ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు సంబంధిం చిన గోడపత్రికను ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారా యణ స్వామి ఆవిష్కరించారు. ఈ నెల 9నుండి ఆడికృ త్తిక బ్రహ్మోత్సవాలు జరుగనుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కేశవరెడ్డి, మండలకన్వీనర్ శేఖర్‌రాజు, కో-అప్షన్‌మెంబరు పట్నంప్రభాకర్, నాయకులు చందురాజు, ఇంజంకృష్ణయాదవ్ , శేఖర్‌రెడ్డి, పయణిరెడ్డి, భక్తులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## పుంగనూరు ఘటన దిగ్భ్రాంతికరం



శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం భాధారకరం
వైసిపి ఎంఎల్ఏ అభ్యర్ధి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

**చంద్రగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** పుంగనూరులో శుక్రవారం చోటుచేసుకున్న ఘటన దిగ్భ్రాంతికరమని వైసిపి ఎంఎల్ఏ అభ్యర్ధి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిఅన్నారు. పుంగనూరు ఘటనపై శనివారం చంద్రగిరిలో ఆయన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలసి సామూహిక నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ళు సిఎంగా పనిచేసిన చంద్రబాబు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించడం భాధాకరమన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో గాయపడిన 27 మంది పోలీసులు, సామాన్య ప్రజలకు తనప్రగాఢ సానుబూతిని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, ఎన్నికల కమీషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను కాపాడాలి.!

టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి

**చంద్రగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అరాచకాలపై భారత ప్రభుత్వం దృష్టి సారించి కాపాడాలని టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి కోరారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద పుంగనూరు ఘటనను ఖండిస్తూ టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని ఆదేశాల మేరకు శనివారం రాత్రి క్యాండిల్ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ కొత్తఎత్తుగడ అనీ, ప్రజలను భయాంధోళనలకు గురి చేయడంలో భాగంగానే అధికార పక్షం పుంగనూరులో నిర్వహించిన విచారకర దుర్ఘటన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల పరిశీలనకు వెళుతున్న క్రమంలో తనదారిన తాను వెళుతుండగా అధికార పక్షానికి అనుమతులు ఎలా ఇస్తారని నిలదీశారు. అధికార పక్షం తన రెచ్చగొట్టే చర్యలను విడనాడి ప్రతిపక్షాన్ని తగిన విధంగా గౌరవించాలన్నారు. మేధావులు తమ మౌనాన్ని విడనాడి ఇకనైనా బయటకు వచ్చి తమగొంతు వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు, మహిళా రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఔషధాల పరిశోధన ప్రక్రియలో ఫార్మా డి విద్యార్ధులదే కీలక పాత్ర

శ్రీపద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ భారతి

**రామచంద్రాపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త:** ఫార్మశీ రంగంలో జరుగుతున్న ఔషధ పరిశోధనా ప్రక్రియలో ఫార్మా డి విద్యార్ధులదే కీలకపాత్ర అని శ్రీపద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ భారతి అన్నారు. శనివారం వెంకట్రామాపురంలోని సెవెన్‌హిల్స్ ఫార్మశీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధుల చికిత్సలకు వినియోగించే ఔషధాల స ృష్టికి ఫార్మా డి విద్యార్ధులు కీలకంగా వ్యవహరించాలని అన్నారు. ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా వున్నాయనీ, వాటిని అందిపుచ్చుకుని ముందుకుసాగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్‌బాబు మాట్లాడుతూ సెవెన్‌హిల్స్ కళాశాలలో నైపుణ్యాలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్ధులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్వీయు ఫార్మాశీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ అప్పారావు, ఎస్వీయు కాలేజ్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ వైరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ నరశింహ, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి అభివృద్ధి మోహిత్ అన్నతోనే సాధ్యం..!

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

**రామచంద్రాపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త:** చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధి మా అన్నయ్య వైసిపి ఎంఎల్ఏ చెవిరెడ్డి మోహిత్ రెడ్డితోనే సాధ్యమని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. శనివారం రావిళ్ళవారిపల్లి, బ్రాహ్మణ కాల్వ, శెట్టివారిపల్లి, పెద్దినాయుడు కండ్రిగ, తొట్టికాడ ఇండ్లులో గడపగడపకు హర్షిత్ రెడ్డి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో సమస్యలపై ఆరా తీసి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏవి బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, తహశీల్దార్ జి.సి.వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ మహ్మద్‌రఫీ, వైసిపి నాయకులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## 24 మందిపై కేసులు నమోదు:ఎస్ఐ

చంద్రగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:

నిబంధనలను ఉల్లంఘించిన 24 మందిపై ఐపిసి 341, 283, 34 సెక్షన్లతో కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వంశీధర్ తెలిపారు. చంద్రగిరిలో ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రాస్తారోకోలు నిర్వహించకూడదన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఏ అభ్యర్ధి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం నిబంధనలను ఉల్లంఘించి ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. దీంతో మోహిత్ రెడ్డితో పాటు మరో 24 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు శాంతిభద్రతలకు విఘాతం కలగనీయక సహకరించాలని కోరారు.

## ప్రేక్షకులతో సందడికి

నేడు జీ తెలుగులో ఫ్యామిలీనంబర్ 1 షో

**తిరుపతి, ఆగస్టు 5ప్రభాతవార్త:** తెలుగుప్రేక్షకులను అలరించేలా సరికొత్త కాన్సెప్ట్‌తో జీ తెలుగు ఛానెల్ వినోదాన్ని పంచడానికి 6వతేదీ ఆదివారం ఫ్యామిలీ నంబర్ 1 ప్రారంభమవుతుందని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. తారలు తమ కుటుంబాలతో కలసి సందడిచేయనున్న ఈ షో ప్రేక్షకుల కుటుంబాలను ఎంతగానో ఆకట్టుకుంటుం దన్నారు. 6వతేదీప్రారంభమైప్రతిఆదివారం ఉదయం 11గంటలకు జీ తెలుగులోప్రసారమ వుతుందన్నారు. ఎనిమిది కుటుంబాలు సాగించే వినోధభరితమైన సరదా సమరాన్ని ప్రేక్షకులు ఆనందించలన్నారు.

## గ్రీన్ అంబాసిడర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించండి : ఎఐటియుసి

**విజయపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త :** గ్రీన్ అంబాసిడర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన విజయపురంలో శనివారం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. 18 నెలలుగా పెండింగ్‌లో వున్న వేతనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్వచ్చ భారత్‌లో భాగంగా పారిశుధ్య కార్మికులను నియమించారని, వారి ద్వారా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు నిర్వహించడంతో పాటు తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువులు తయారు చేస్తున్నారని, వారికి సకాలంలో వేతనాలు అందించాలని కోరారు. అనంతరం ఎంపిడిఓ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఏసుపాదం, మండల అధ్యక్షుడు చెంచురామయ్య, కార్యదర్శి రవి, నాయకులు ఏలుమలై, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

చైర్మన్ కొడగంటి రమేష్



**పుత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త :** పట్టణంలో శ్రీ కామాక్షీ సమేత సదాశివేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొడగంటి రమేష్, కార్యనిర్వాహణాధికారి మునికృష్ణయ్య తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ సదాశివేశ్వరస్వామి ఆలయం అయిదు, ఆరు శతాబ్దాలలో త్రిలోచన పల్లవ రాజు కాలంలో నిర్మితమైందని, 197/2 సర్వే నెంబరులో వున్న అరవై సెంట్ల కోనేరు స్థలం రెవెన్యూ రికార్డుల్లో దేవాలయ స్వాధీన, అనుభవంలో వున్న పుష్కరిణిగా నమోదై వుందని తెలిపారు. చాలా కాలం పాటు కొందరు ఈ కోనేరు స్థలాన్ని ఆక్రమించుకుని వున్నారని, 1989వ సంవత్సరంలో ఆక్రమణదారులను ఖాళీ చేయించేందుకు దేవాదాయ శాఖ కోర్టులో కేసులు వేసిందని తెలిపారు. 2006వ సంవత్సరంలో ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోర్టు ఆదేశాలిచ్చిందన్నారు. ఆ మేరకు అదే సంవత్సరం ఏప్రిల్ 28వ తేదీన ఆక్రమణలను తొలగించి దేవస్థానం కోనేటి స్థలాన్ని స్వాధీనం చేసుకుందని వివరించారు. కోనేరు నిర్మాణం నిర్మాణానికి దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ (సిజిఎఫ్) నుంచి రూ. 25 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. కోనేరు నిర్మాణానికి పోగా మిగిలిన స్థలంలో ఆలయ అభివృద్ధి, వివిధ పూజాది కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఆర్ధిక వనరులు సమకూర్చుకునేందుకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కోనేటి స్థలం సదాశివేశ్వరస్వామి దేవస్థానానికి చెందినదనడంలో ఎటువంటి సందేహం లేదని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు జీవరత్నంనాయుడు అక్రమ కట్టడాలంటూ చేసిన ఆరోపణలు భక్తుల మనోభవాలు దెబ్బతినే విధంగా వున్నాయని తెలిపారు. ఆలయ అభివృద్ధికి కట్టుబడి వున్నామని తెలిపారు. సమావేశంలో జి.రమేష్, బాబు, సుందరం తదితరులు పాల్గొన్నారు.

## సుమతి శతక విజేతలకు బహుమతులు

**శ్రీకాళహస్తి, ఆగస్టు 5 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలో నాగమల్లి కృష్ణమూర్తి ఫౌండేషన్ సారధ్యంలో విద్యార్ధిని విద్యార్ధులకు వేమన, సుమతి శతక పద్యపఠన పోటీలు నిర్వహించారు. విజేతలకు శనివారం పట్టణంలోని మున్సిపల్ బాబూ అగ్రహారం ఉన్నత పాఠశాలలో బహుమతుల ప్రధానోత్సవం ఏర్పాటు చేసారు. ఈ సభకు ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వరాలయ దర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరు కాగా అతిధులుగా అక్బర్‌బాషా, పూల్లూరు రామకృష్ణయ్య, భూలక్ష్మీదేవిలు హాజరు కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప అధ్యక్షత వహించారు. పట్టణ ప్రముఖులు నందా మెడికల్స్ అధినేత నందగోపాల్, డాక్టర్ దీన్‌దయాళ్, పత్తి జ్యోతి రావు, వంశీ కృష్ణ, పోలస్వామి కార్తికేయన్, పాన్ కార్డు రవికుమార్, మహేశ్ ఖ్యాతి, పద్మజ, శ్రీనివాసులు, యోగానంద్, ఎంఎస్‌మౌలాలి, హాజరయ్యారు. విజేతలకు ఫౌండేషన్ నిర్వాహకులు నాగమల్లి రాజశేఖర్ పర్యవేక్షిస్తూ బహుమతులను అందజేసారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు మాజీ రాష్ట్రపతి ఏపిజే అబ్దుల్ కలాం జ్ఞాపికను అందజేసారు.



## శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా కంప్యూటర్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సు

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 5, ప్రభాతవార్త

టిటిడి ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నూతనంగా కంప్యూటర్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సు ప్రారంభమైంది. ఈ కోర్సులో చేరదలుచుకున్న విద్యార్థులు పాలిసెట్ కౌన్సిలింగ్‌లో డిసిఎంఈ కోర్స్ ఆప్షన్‌ను ఎంచుకోవాల్సిందిగా కోరడమైంది. కాలేజీ కోడ్ ఎస్‌పిడబ్ల్యూటి, కోర్సు కోడ్ డిసిఎంఈ అదే విధంగా డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిప్లొమా ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ కోర్సులను కూడా పాలీసెట్ కౌన్సిలింగ్‌లో ఆప్షన్‌గా ఎంచుకోగలరన్నారు. ఈ కోర్సులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మాత్రమే ఉంటుందన్నారు. విద్యార్థినులకు ఉచితంగా హాస్టల్ సదుపాయం ఉందని ఈ అవకాశాన్ని విద్యార్థినులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

## ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

-ఎంపిడిఓ వెంకట నారాయణ



**తిరుపతి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతిరూరల్ ఎంపిడిఓ వెంకట నారాయణ సూచించారు. శనివారం ఉచిత వైద్య శిభిరాలను తిరుచానూరు, వేదాంతపురం పంచాయతీలలో నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ముందు చూపుతో ఉచిత వైద్య శిభిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. వైద్య సేవలలో ప్రజలు పాల్గొని పరీక్షలు చేయించుకుంటే ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ, తుడా వి.సి. లక్ష్మీ, డిఎల్‌పిఓ, ఇవోఅండ్ పిఆర్డి, ఆయా గ్రామ పంచాయతీ కార్యధర్శులు పాల్గొన్నారు.

## సుందరీకరణ పనులు మరింత వేగవంతం చేయాలి

అధికారులను ఆదేశించిన కమిషనర్ హరిత



**తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 5, ప్రభాతవార్త** బాలాజీ కాలనీలోని ఫ్రీ లెఫ్ట్ వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. శనివారం బాలాజీ కాలనీలోని ఎస్వీ సంగీత నృత్య కళాశాల వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను కమిసనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్రీ లెఫ్ట్ కూడలిలో పూల మొక్కలు ఎక్కువగా నాటాలన్నారు. అలాగే పెయింటింగ్ పనులు మరింత వేగంగా చేయాలన్నారు. పరిశీలన కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు ప్రణాళికతోనే పుంగనూరులో అరాచకాలు

ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



**తిరుపతి టౌన్, ఆగస్టు 5, ప్రభాతవార్త** ముందస్తు ప్రణాళికతోనే టిడిపి నాయకులు పోలీసులపై దాడులు చేసారని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఎమ్మెల్సీ కార్యాలయంలో మాధ్యమాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరి మాంత్రిక కోట నుండి వదిలిన కుటిల ఆయుధ ఫలితమే ప్రశాంత పుంగనూరులో పచ్చ చొక్కా అరాచక శక్తులు చెలరేగిపోవడమని తీవ్రంగా మండిపడ్డారు. మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో శాంతికి, ప్రజా జీవనానికి భంగం కలుగుతున్నదని సంయమనము పాటిస్తున్నారు. ఎన్ని రెచ్చగొట్టుడు రాజకీయాలు చేసినప్పటికీ సంయమనము పాటించిన పుంగనూరు వైసిపి నాయకులు కార్యకర్తలు కృతజ్ఞతలు తెలియజేసారు. ఒక్కో జిల్లాలో ఒక్కో చోట అల్లర్లకు ఆజ్యం పోసేకి ప్రత్యేక కౌటిల్య టూల్ కిట్ రూపొందించినట్లు తనకు ప్రత్యేక సమాచారం అందినట్లు వెల్లడించారు. దీని ప్రకారం ఒక్కో జిల్లాలో ఒక్కో రకంగా ఆరాచకానికి తేదేపా గ్యాంగ్ పాల్పడుతున్నదని ఆరోపించారు.

## మోటారు సైకిళ్ల దొంగతనం కేసులో అంతరాష్ట్ర దొంగ అరెస్టు

**తిరుపతి క్రైం, ఆగస్టు 5, ప్రభాతవార్త** మోటారు సైకిళ్ళ దొంగతనం కేసులో అంతరాష్ట్ర బైక్ దొంగ తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన గోవింద పళనిస్వామి (31) ను అరెస్టు చేసిన్నట్లు తిరుపతి సబ్ డివిజన్ పోలీసు అధికారి సురేంద్ర రెడ్డి సూచనల మేరకు ఈస్ట్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ డి. మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస రావు, సిబ్బంది బృందాలు అరెస్టు చేసారు. ఈ జూన్ 16వ తేది రాత్రి 10 గంటల నుండి 3 గంటల మధ్య కర్నాల వీధికి చెందిన బి. ప్రవీణ్ కుమార్ తన స్ప్లెండర్ మోటార్ సైకిల్ దొంగలించారని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తూ శనివారం తిరుపతి టివిఎస్ సర్కిల్ వద్ద వాహన తనిఖీ సమయంలో ముద్దాయి గోవింద్ పళని స్వామిని అరెస్టు చేసి 9 మోటర్ సైకిల్‌లను స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేసారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి. మహేశ్వర రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాస రావు, ఈస్ట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మునిరాజులు, కానిస్టేబుల్లు జ్యోతినాద్, రవి, మహేష్, ప్రభాకర్‌లను తిరుపతి జిల్లా ఎస్పి అభినందించారు.

## మిషన్ ఇంద్ర ధనస్సు విజయవంతం చేయండి

**నగరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** మిషన్ ఇంద్ర ధనుస్సు విజయవంతం చేయండి అని జిల్లా టీకా అధికారి డా. రవిరాజు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్‌కార్యాలయంలో నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మమ్స్, రుబెల్లా వ్యాధులను ఈ ఏడాదితోపూర్తిగా లేకుండా చేయాలన్న ఉద్దేశంతోనే మిషన్ ఇంద్ర ధనుస్సు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 12 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వాక్సిన్లు వేసుకోక మధ్యలో వదిలేసిన వారు, పూర్తిగా వ్యాక్సిన్లు వేసుకోని వారి వివరాలను ఇప్పటికే సర్వేల ద్వారా సేకరించడం జరిగిందన్నారు. వారందరికి వ్యాక్సిన్లు వేయాలన్నారు. అలాగే ఈ నెల 10వ తేదీన నులి పురుగుల మందులు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, సీడీపీవో కృష్ణవేణి, ఎంఈవో శ్రీదేవి, ఆశలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## రోడ్డు సమస్య పరిష్కారం

**నగరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధి రామ్‌నగర్‌లో రోడ్డు సమస్య పరిష్కారమైంది. మంత్రి రోజా ఈ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు రోడ్డు, కల్వర్టు సమస్యను ఆమె దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆమె రోడ్డు, కల్వర్టుల నిర్మాణాన్ని చేపట్టాలంటూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వెంటనే ఎస్టిమేట్లు వేసుకున్న అధికారులు గడప గడపకు నిధుల ద్వారా రోడ్డు, కల్వర్టు నిర్మాణాలు ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తున్నారు. శనివారం పనులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. మంత్రి ఆదేశాలతో విడుదలైన గడప గడపకు నిధులు రూ.లక్ష వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. త్వరలో రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ నరేష్, ఏఈ రమేష్, నవీన్‌లు పాల్గొన్నారు.

## చేనేత వస్త్రాలు దరిద్దాం - చేనేతను గౌరవిద్దాం

**నగరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమర ఉద్యమంలో భాగంగా స్వదేశీ ఉద్యమం 1905 ఆగస్టు 7న మొదలైందని అందుకు గౌరవ సుచికంగా అన్ని ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులు, పౌరులు, రాజకీయ నాయకులు, అందరు సోమవారం చేనేత వస్త్రాలు దరించి కార్యాలయాలకు హాజరు కావాలని ఆర్డీవో సృజన అన్నారు. ఈ మేరకు జిల్లా పాలనాధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆ దేశాల అనుసారంగా అందరూ చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు. అలాగే అక్టోబరు 2 గాంధీ జయంతి రోజున ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం మొదలు అవుతుందన్నారు. ఈ పోటీలకు సంబంధిత లోగో తయారు చేయడానికి ప్రభుత్వం అందరికి అవకాశం కల్పించిందన్నారు. కనుక విద్యార్థులు, పౌరులు, ఉత్సాహవంతులు, లోగో తయారు చేసి డబ్లుడబ్ల్యు ఆడుదాం ఆంధ్ర కామ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇలా అప్‌డేట్ చేసిన ఉత్తమ లోగోలను కమిటీ సభ్యులు పరిశీలించి చక్కటి లోగో తయారు చేసిన చక్కటి లోగో తయారు చేసిన వారిని ఎంపిక చేసి తగు బహుమతి ఇవ్వబడుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## యువకుడు ఆత్మహత్య

నగరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:

ఆరోగ్య సమస్యతో మురళి(31) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మాంగాడు గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు మురళి అవివాహితుడు గత కొంత కాలంగా తీవ్రమైన కదుపునొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం ఈ సమస్యతో ఆస్పత్రిలోను చికిత్స పొందాడు. అయినా నొప్పి తగ్గలేదన్న బాధతో శనివారం మాంగాడు చెరువు కట్టపై ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

## సూర్యరశ్మితో చీడపీడల నియంత్రణ

మామిడి కొమ్మల కత్తిరింపుపై అవగాహన,
ఉద్యానవనశాఖ మండల అధికారిణి ఎస్.శైలజ

**చంద్రగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:**

సూర్యరశ్మి పడటం ద్వారా చీడపీడలు నియంత్రించబడగలవని ఉద్యానవనశాఖ మండల అధికారిణి ఎస్.శైలజ అన్నారు. మండల పరిధిలోని పనపాకంలో శనివారం మామిడి కొమ్మల కత్తిరింపులపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎదిగిన మామిడి చెట్టులోపలి చిక్కటి కొమ్మలను, బలహీన కొమ్మలను, చెట్టుకు చెట్టుకు ఆనుకున్న కొమ్మలను ఎండిన కొమ్మలను, తూర్పు పడమర దిక్కుల్లో సూర్యరశ్మి పడేవిధంగా ఒక కొమ్మను, చెట్టు మధ్యలోని గొడుగు కొమ్మను కత్తిరించాలన్నారు. చెట్టు కొమ్మలను సరైన పద్ధతిలో కత్తిరించడం ద్వారా చెట్టులోని ప్రతి ఆకుపై సూర్యరశ్మి పడుతుందన్నారు. సూర్యరశ్మి పడటం వలన చిగురు, పూత దశలో వచ్చే తేనెమంచు పురుగు ఉధృతిని కట్టడి చేస్తుందన్నారు. కత్తిరింపుల అనంతరం తప్పనిసరి కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు, క్లోరోపైరిపాస్ 3 మిల్లీ గ్రాములు, జిగురు 0.5 మిల్లీ గ్రాములు, ఒక లీటరు నీటిలో కలిపి చెట్టుబెరడు, లోపలి కొమ్మలు తడిచే విధంగా పిచికారీ చేయాలన్నారు.

# తిరుపతి డివిజన్

## ఒటమి భయంతో వైకాపా నేతలపై టిడిపి దాడులు



జిల్లా వైకాపా కార్యదర్శి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి
నింద్ర, ఆగస్టు 5 ప్రభాతవార్త :

ఒటమి భయంతోనే వైకాపా నాయకులు, కార్యకర్తలపై టిడిపి నేతలు దాడులు చేస్తున్నరని యంపిటిసి సభ్యులు, జిల్లా వైకాపా కార్యదర్శి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించినారు. శనివారం మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ చెన్నై తిరుపతి జాతీయ రహదారిపై టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు చిత్తూరుజిల్లా పర్యటన సందర్భంగా జరిగిన విధ్వంసంకు నిరసనగా జిల్లా వైకాపా కార్యదర్శి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరందామయాదవ్, ధశరధనాయుడు, శివ, సూర్య, దేవదాసు, గుణశేఖర్, నూతన్‌బాబు, తదితరులు పాల్గోన్నారు.

## రాష్ట్రంలో అల్లర్లు సృష్టించింది తెలుగుదేశంపార్టీ



వైకాపా రాష్ట్ర నాయకురాలు కృపాలక్ష్మి
కార్వేటినగరం, ఆగస్టు 5 ప్రభాతవార్త:

రాష్ట్రంలో ఒకపక్క ప్రశాంతమైన సంక్షేమపాలన జరుగుతుంటే, మరోపక్క రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తూ తెలుగుదేశం పార్టీ గుండాయిజానికి దిగుతుందని వైకాపా రాష్ట్రనాయకురాలు కృపాలక్ష్మి అన్నారు. కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో నిరసన కార్యక్రమం, బంద్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా అంగళ్ళులో చంద్రబాబు పర్యటన నేపధ్యంలో రెచ్చిపోయిన టిడిపి మూకలు, దగ్గరుండి వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలపై రాళ్ళతో చంద్రబాబు దాడి చేయించారన్నారు. కార్వేటి నగరంలో పాఠశాలలు, దుకాణాలను మూయించి బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి లతాబాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్ ధనంజయవర్మ, ఎంఎంసి మాజీ చైర్మన్ కృష్ణయాదవ్, కో-అప్షన్‌మెంబరుపట్నంప్రభాకర్, నాయకులుపురందర్, చందురాజు, వెంకటేష్, వెంకటరత్నం, శేషాద్రి, దొర బాబు, శేఖర్‌రెడ్డి, ధనశేఖర్‌వర్మ, ధనరాజ్, రఫీ, శివప్రకాష్‌మొదలియార్, కార్యకర్తలు, నాయకులుపాలొన్నా రు

## 16 నుండి నిలిచిపోయిన వస్తువులకు బహిరంగ వేలం

-ఆర్టీసీ కమర్షియల్ ఏటిఎం సురేంద్రబాబు

తిరుపతి ప్రెస్‌క్లబ్, ఆగస్టు 5 ప్రభాతవార్త:

ఈనెల 16,17,18 తేదీలలో మూడు రోజుల పాటు ఉదయం 10-30 గంటలకు ఆర్టీసీ కార్గో పాయింట్ నందు కస్టమర్లు డెలివరీ తీసుకోని కారణంగా, నిలిచిపోయిన పార్సెల్ వస్తువులకు బహిరంగ వేలం వేయనున్నట్లు ఏపిఎస్‌ఆర్టీసీ కమర్షియల్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఆర్.సురేంద్రబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022 జనవరి 1 నుండి 2023 జనవరి 31 వరకు ఏడాది పాటు కార్గో పాయింట్‌కు చేరిన వస్తువులను తీసుకోవాలని కస్టమర్లకు పలుమార్లు ఫోన్ చేసి తెలిపినా వారు తీసుకోలేదన్నారు. కావున తాము బహిరంగ వేలం వేయడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. వేలంలో పాల్గొని వస్తువులను పాడుకున్న తరువాత తక్షణం పైకం చెల్లించి వస్తువులను తీసుకెళ్లాలి. పైకం చెల్లించనిచో వారి పాటను రద్దు చేసి, ఆ వస్తువులకు తిరిగి వేలం వేయబడుతుందని, అంతిమ నిర్ణయం ఆర్టీసీ వారిదేనని ఏటిఎం స్పష్టం చేశారు.

## విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

-ఈనెల 7న మహా ధర్నా -సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

తిరుపతి ప్రెస్‌క్లబ్, ఆగస్టు 5 ప్రభాతవార్త:



విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, 45 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 7వ తేదీ సోమవారం స్థానిక ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం ముందు వేలాది మందితో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి వెల్లడించారు. ఈ మేరకు శనివారం స్థానిక యశోదనగర్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విద్యుత్ కార్మికులతో కలిసి ధర్నా కార్యక్రమం తాలూకు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మురళి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో కార్మికుల బతుకులు దినదిన గండంగా తయారయిందని వాపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్రంలోని 7 యూనియన్ల ఆధ్వర్యంలో కార్మిక సంఘాలతో పోరాట కమిటీ ఏర్పడిందని, ఈ కమిటీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతరం ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి టి.కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని డివిజన్ల నుండి వేలాదిగా కార్మికులు తిరుపతికి తరలి రావాలని పిలుపునిచ్చారు. సోమవారం నాటి ఉదయం 9 గంటలకు లక్ష్మీపురం సర్కిల్ నుండి ఎస్పీడిసిఎల్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన ఉంటుందని, 10 గంటలకు ధర్నా కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రహ్మణ్యం, రమేష్, వి.నాగరాజు, జనార్దన్, మునిరాజ, వేణుగోపాల్, టి.సుబ్రహ్మణ్యం, మురళి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

నారాయణవనం, ఆగస్టు 5 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనంలోని తాతా సొరకాయులస్వామి కల్యాణ మండపంలోశనివారం మధ్యాహ్నం 3గంటలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ల ద్వారా అందించే 10 రకాల పోషణ కిట్లను ఇకపై ఇంటి వద్దనే అందించడం జరుగుతుందన్నారు. 6నుంచి36 నెలల వరకు గర్భవతులకు బాలింతలకు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, ఎంపిడిఓ గుణశేఖర్, మండల వైకాపా నాయకులు ఆర్‌డి ఏకాంబరం, అన్నాదొరై, ఊరప్ప, సుధాబాబు, మనోహర్, మోహన్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బేబి, సర్పంచులు, వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసులపై అల్లరిమూకల దాడిపై వైకాపా నిరసన

నారాయణవనం, ఆగస్టు 5 ప్రభాతవార్త :



పుంగనూరులో శుక్రవారం పోలీసులపై అల్లరిమూకల దాడిని నిరసిస్తూ శనివారం సాయంత్రం నారాయణవనం అంబేద్కర్ సర్కిల్ వద్ద సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రక్షణగా వున్న పోలీసులపై దాడులు చేయడం సమంజసం కాదన్నారు. అల్లరి మూకలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిరసన ఈ కార్యక్రమంలో ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, మండల వైకాపా నాయకులు ఆర్‌డి ఏకాంబరం, అన్నాదొరై, ఊరప్ప, సుధాబాబు, స్సుబమణ్యంరెడ్డి, ధర్మలింగం, అయ్యప్ప, ఆరుముగం, రామమూర్తి, మనోహర్, మోహన్, వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని చిత్రలేఖన పోటీలు

తిరుపతి, ఆగస్టు 5, ప్రభాతవార్త



తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్ 9,10,13, గృహ విజ్ఞాన శాస్త్ర విభాగం కలిసి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. వారు తల్లిపాలలో గల పోషకముల గురించి, వాటి ప్రాముఖ్యత గురించి చిత్రాలను గీశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యావతి, గృహ విజ్ఞాన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బిందు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి తల్లిపాలు అప్పుడే పుట్టినటువంటి పిల్లలకు త్రాగించడం వలన వారి ముందు జీవితంలో వివిధ రకాలైనటువంటి వ్యాధులతో పోరాడేటువంటి శక్తి వస్తుందని, తల్లిపాలు తాగించడం వలన ప్రసవం తరువాత తల్లి ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ విభాగానికి చెందిన డాక్టర్ సుజాత, గృహ విజ్ఞాన విభాగానికి చెంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నగరిలో బంద్ విజయవంతం

నగరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:

నగరి పట్టణంలో శనివారం బంద్ ప్రశాంతంగా విజయవంతమైందని మంత్రి రోజా సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. నగరి టవర్‌క్లాక్ నుంచి ఓంశక్తి గుడి వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. పుంగనూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చంద్రబాబు నాయకత్వంలో చెలరేగిన దౌర్జన్యాలు హింసకు వ్యతిరేకంగా నగరి పట్టణంలో వైసీపీ నాయకత్వంలో ప్రజలు స్వచ్చందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఈ మేరకు నగరి సీఐకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా కళ్యాణ వెంకటేశ్వరుని ఊంజల్‌సేవ

నారాయణవనం, ఆగస్టు 5 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, అర్చకులు పాల్గొన్నారు.

## వైభవంగా ఆడి శుక్రవారం పూజలు

నగరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:



పట్టణ పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో ఆడి శుక్రవారం పూజలు వైభవంగా జరిగాయి. ఆడి నెల అమ్మ వారికి ప్రత్యేకం కావడంతో ఆలయాల వద్ద భక్తుల సందడి అధికంగా కనిపించింది. స్థానిక ఓంశక్తి ఆలయంలో ఈపూజలను పురస్కరించుకుని కరకంఠేశ్వర స్వామి ఆలయం నుంచి 450 మంది ఎరుపు దుస్తులు ధరించి భక్తులు గంజిని ఊరేగింపుగా ఓం శక్తి ఆలయం వరకు మంగళ వాయిద్యాలు, గెరిగె నాట్యాలు నడుమ తీసుకెళ్ళడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఊరేగింపులో అమ్మవారి వేషధారణలో వచ్చిన చిన్నారులు పలువురిని ఆకర్షించారు. భక్తులు తెచ్చిన గంజి, అంబలిని ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలుగా పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలిండియా పోస్టల్ డిపార్ట్‌మెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరత్‌కుమార్, ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. ఓరుగుంటాలమ్మ ఆలయంలో ఆడి శుక్రవారం పూజల్లో భాగంగా అమ్మవారికి స్వహస్తాలతో పాలాభిషేకం చేసే అవకాశం భక్తులకు కల్పించారు. పాలతో వచ్చిన భక్తులు అమ్మవారికి అభిషేకం చేశారు. అభిషేకానంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి దర్శనార్థం ఉంచారు.

## తిరుచ్చిపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న

చంద్రగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తులను భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ యం.గోపీనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణకుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంట్టు ధనశేఖర్, అర్చకులు ఏవైఎస్ఎన్ శ్రీనివాసాచార్యులు, అధ్యాపక సంతాన్ కృష్ణన్, పరిచారిక విష్ణు స్వామి, జమేదర్ మంకు చిరంజీవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌బీకే నుంచి వేరు శేనగ బస్తాలు మాయం

### రైతులు ఆందోళన

ఎర్రవారిపాలెం, ఆగస్టు 5 ప్రభాతవార్త

ఎర్రవారిపాలెం ఆర్‌బీకే నుంచి వేరు శేన బస్తాలు రాత్రిరాత్రికే మాయం అయినట్లు రైతులు ఆరోపించారు. ఆమేరకు శనివారం స్థానిక ఆర్‌బీకే ముందు రైతులు తమదైన శైలీలో ఆందోళన చేశారు.వేరుశేనగ బస్తాలు తో పాటు, ఉలవలు, కందులు, ప్రభుత్వం రైతులకు సబ్సిడి ధరలకు ఇవాల్సి ఉండగా రాజకీయ నాయకులకు మాత్రమే కొందరికి ఇచ్చి అధికారులు చేతలు దులుపుకొన్నారని రైతులు ఆరోపించారు. రైతులు వ్యవసాయాధికారిని కలిసే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు. దీంతో కార్యలయాలం ఎదట ఆందోళన చేపట్టాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి ప్రభుత్వ సరఫరా చేసిన వచ్చిన వేరు శేనగ బస్తాలు, కందులు, ఉలవల బస్తాలను రికవరి చేయాలని రైతులు కోరారు.

## అమరరాజాను సందర్శించిన యూఎస్ కౌన్సిల్ బృందం



రేణిగుంట, ఆగస్టు 5 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ అమరరాజా కర్మాగారాన్ని యూఎస్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ సందర్శన ముఖ్య ఉద్దేశం అమర రాజా సంస్థతో కలిసి ఎనర్జీ రంగంలో పని చేయడానికి వ్యాపార అవకాశాలు పరిలిస్తున్నామన్నారు. ముఖ్యంగా మొబిలిటీ, గ్రీన్‌ఎనర్జీ రంగాల్లో అవకాశాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. ఇప్పటికే అమర రాజా సంస్థ పురోగతిని సాధిస్తున్నదని, సంతృప్తికరంగా అమర రాజాతోకలసిపని చేయడానికి వ్యాపార అవకాశాలను పరిశీలిస్తున్నామని అమర రాజా వివిధ రంగాల్లో మంచి వ్యాపార పురోగతిని సాధిస్తున్నదని, కర్మాగారం అంతర్, బాహ్య పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం గోచరిస్తుందన్నారు. అమర రాజా ఆ్యటరీస్ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ నరసింహులునాయుడు, ప్రెసిడెంట్ న్యూ ఎనర్జీ బిజినెస్ విజయానంద్ సంయుక్తంగా మాట్లాడుతూ యూఎస్ కౌన్సిల్ జనరల్ అమర రాజా సంస్థని సందర్శించడం సంతోషాదాయకమన్నారు. యూఎస్ కౌన్సిల్ జనరల్ సంస్థ పాటిస్తున్న అంతర్జాతీయ పరిమాణాలను ప్రశంసించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో యూఎస్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌తో పాటు యూఎస్ వైస్ కౌన్సిల్ అఖిల్ బేరి, ఎస్ వాణిజ్య సలహాదారు సునీల్‌కుమార్ సిబాత్రిపాఠి, సెక్యూరిటీ ఇన్వెస్టిగేటర్ కిరణ్ పాలవరుపు, అమర రాజా బ్యాటరీస్ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ నరసింహులునాయుడు, ప్రెసిడెంట్ న్యూ ఎనర్జీ బిజినెస్ విజయానంద్, అమర రాజా బ్యాటరీస్ అంతర్జాతీయ మార్కెటింగ్ హెడ్ ఇండివర్, అమర రాజా ఇన్ఫ్రా పవర్ డివిజన్ హెడ్ ద్వారక, లిథియం బ్యాటరీ ప్లాంట్ ఆపరేషన్స్ అండ్ ప్రాజెక్ట్స్ హెడ్ నిరంజన్, అమర రాజా బ్యాటరీస్ ఆటోమోటివ్ విభాగం హెడ్ శ్రీనివాసరావు, సర్వీస్ విభాగం హెడ్‌ఎస్ఎల్ఆర్ నాయుడు, రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నేటితరం యువత భారత శక్తి

### భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
### ఘనంగా ఎంబియు 12వ గ్రాడ్యుయేషన్ డే



చంద్రగిరి, ఆగస్టు5 ప్రభాతవార్త:

యావత్ ప్రపంచంలో నేడు అన్ని వర్గాల వయస్సు వారికి మొబైల్ ఫోన్ అధునాతన వ్యసనంగా మారిందని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంక య్యనాయుడు అన్నారు. మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో శనివారం 12వ గ్రాడ్యుయేషన్ డే సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ భారతదేశానికి అతిపెద్ద శక్తి నేటితరం యువత అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా రాణించాలనీ, దేశానికి సేవ చేయడం విస్మరించవద్దన్నారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. మోహన్‌బాబు నిర్మించిన సాయిబాబా ఆలయంలో స్వామివారిని ఆయన దర్శించుకున్నారు.

## ఉపరాష్ట్రపతికి 'లోపలిమాట' పుస్తకం అందజేత

శ్రీకాళహస్తి, ఆగస్టు 5 ప్రభాతవార్త



భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు, కథారచయిత, అరసం సభ్యులు దేవి ప్రసాద్ ఒబ్బు తాజా రచన లోపలిమాట పుస్తకాన్ని శనివారం ఉదయం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో కలసి ఆయనకు అందించారు. మాజీ ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ లోపలి మాట వంటి సృజనాత్మక పుస్తకాలు నేటి సమాజానికి ఎంతో అవసరం అంటూ రచయితను అభినందించారు. ముఖ్యంగా బడిపిల్లలు పుస్తకపఠనం అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలుగుభాషోద్యమ సమితి నాయకులు డాక్టర్‌నాదెండ్ల శ్రీమన్నారాయణ, అభ్యుదయ రచయితల సంఘం(అరసం) అధ్యక్ష్య, కార్యదర్శులు యువశ్రీమురళీ, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, ఉపాధ్యాయులు నాదెండ్ల మురళీ, బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా.ఆనంద్‌కుమార్, భాను ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి సృష్టికర్త-అపరభగీరధుడు చంద్రబాబు

### -శ్రీకాళహస్తిలో రాక్షసపాలన..సుధీర్‌రెడ్డి



.తొట్టంబేడు, ఆగస్టు 5 ప్రభాతవార్త

అమరావతి సృష్టికర్త అపరభగీరధుడు తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం శ్రీకాళహస్తి పసుపు జెండాలతోరెపరెపలాడింది. ఆయన రాకకోసం జనం, మహిళలు, ప్రజలు బిపి అగ్రహారం మలుపు వద్ద నుంచి నిరీక్షించారు. ఆయన రాకతో ముందుగా క్రేన్‌తో భారీ పూలమాలతో సత్కరించారు. ఇక్కడి నుంచి రోడ్‌షోగా భక్తకన్నప్ప బ్రిడ్జి, సూపర్‌బజారుకూడలి, నెహ్రూవీధి, నగరివీధి నుంచి వచ్చి స్థానిక బేరివారి మండపం వద్ద భారీ బహిరంగసభను నిర్వహించారు. బజారువీధి మొత్తం మహిళలు, తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, నాయకులు, యువత, టిఎన్ఎస్ఎఫ్ కార్యకర్తలు హాజరయ్యారు. బహిరంగసభకు విచ్చేశారు. ముఖ్యఅతిధులుగా బొజ్జలబృందమ్మ, బొజ్జలరిషితరెడ్డి, మాజీ ఎంఎల్ఏలు ఎస్సీవీనాయుడు, సత్రవాడమునిరామయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు విజయకుమార్, శెంజిగరం సుప్రజ, రావిళ్ళమునిరాజనాయుడులు విచ్చేశారు. ఈసందర్భంగా చంద్రబాబుకు అశేషజనవాహినితోస్వాగతం పలికారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ హైటెక్‌సిటీ రూపకర్త చంద్రబాబు అని ఆయన ముందు జగన్‌మోహన్‌రెడ్డి కూడా సరిపోలేడన్నారు. తాము ప్లెక్సీలు వేస్తే సైకో పోవాలి..సైకిల్ రావాలి అన్న ప్లెక్సీలపై మున్సిపల్ అధికారులు, పోలీసులు సైకో అన్న పదంపై ఎరుపురంగు గుర్తు వేశారన్నారు. వైఎస్ఆర్‌పార్టీలో ఎ1 నుంచి లక్ష వరకు సైకోలు ఉన్నారని దుయ్యబట్టారు. నియోజవర్గంలో సైకో ఎంఎల్ఏ మధుసూధన్‌రెడ్డి ల్యాండ్, శాండ్ మాఫియాతో పాటు రెవెన్యూలో దందాలు చేస్తూ పొట్టపెంచుకుని తిరుగుతున్నాడని తీవ్రస్థాయిలో విమర్శించారు. అధికారంలోకి వచ్చాక తాము అన్నీ రప్పిస్తామని, గుడిని, గుడిలో శివలింగాన్ని కూడా మింగేస్తున్నాడని ధ్వజమెత్తారు. నాడు బొజ్జలహయాంలో అందరికి ఇండ్లు ఇచ్చామని అయితే అవి పూర్తిచేయకుండా ప్రస్తుతం జగనన్న కాలనీలంటూ వృదాఖర్చులు చేస్తున్నారన్నారు. తాను బొజ్జలకుటుంబంలో పుట్టడం తన పూర్వజన్మసుకృతమని తన తండ్రి దివంగత నేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి, తన చిన్నాన్న బొజ్జలహరనాథరెడ్డిలను కోల్పోయినా వారు చూపిన మంచిబాటలోనే నడుస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీకి గెలుపుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, మాజీ ఎంపి పనబాకలక్ష్మి,బొజ్జలబృందమ్మ, మాజీ మంత్రి నెలవలసుబ్రమణ్యం, మాజీ ఎంఎల్ఏలు సత్రవాడమునిరామయ్య, ఎస్సీవీనాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, వజ్రంకిషోర్, ఉమేష్‌రావు, మాజీ కౌన్సిలర్ శెంజిగరంసుప్రజ, తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, పాలసరఫరా మాజీ ఛైర్మన్‌రావిళ్ళమునిరాజనాయుడు, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు,రాంబాబునాయుడు,బొల్లినేని జగన్నాధంనాయుడు, బుజ్జి, షాకిరాలీ, అస్మత్, డివినారాయణ, ఖాదర్‌బాషా,తదితరులు పాల్గొన్నారు.

## రెపరెపలాడిన తెలుగుదేశంపార్టీ జెండాలు.

చంద్రబాబునాయుడు శ్రీకాళహస్తి బహిరంగసభకు విచ్చేస్తున్న సందర్భంగా తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు, నాయకులు, కార్యకర్తలు ఏర్పాటుచేసిన ప్లెక్సీలు, బ్యానర్లు ఆకట్టుకుంటున్నాయి. ఎపిసీడ్స్ వద్ద నుంచి డివైడర్ల మద్య భారీగా ప్లెక్సీలు. తెలుగుదేశంపార్టీ జెండాలు రెపరెపలాడుతున్నాయి. ఇక అగ్రహారం వద్ద పెద్దపెద్ద ప్లెక్సీలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఇక రామసేతు వంతెనకు ఇరువైపులా నారాలోకేష్ యువగళం జెండాలు, తెలుగుదేశంపార్టీ జెండాలు పసుపురంగులతో ముంచెత్తాయి. బిపి అగ్రహారం మలుపు వద్ద భారీ పూలమాలను 'క్రేన్' ద్వారా వేసి చంద్రబాబునాయుడుకు స్వాగతం పలికారు.



పోలీసుల ఓవరాక్షన్..

మద్యాహ్నం నాలుగుగంటలకు పైగా జరిగే చంద్రబాబుబహిరంగసభకు ఇటు పెండ్లిమండపం వద్ద బారికేడ్లు ఏర్పాటుచేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక నవయుగ టీస్టాల్ వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లు కూడా ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఇక్కడ విధి నిర్వహణలో ఉన్న పోలీసులు ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి బేరివారి మండపం వద్ద అర్బన్ సిఐ అంజూయాదవ్, ఎస్ఐ శివయ్య,తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర, బుచ్చినాయుడుకండ్రిగ ఎస్ఐ మంజునాథ్‌రెడ్డిలతో పాటు ప్రత్యేక బృందాలు ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షణ చేశారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### - జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త: 77వ దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేలా పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి శనివారం సాయంత్రం జెసి శ్రీనివాసులు చిత్తూరు పోలీసు శిక్షణ మైదానంలో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో ఎంఎస్ టీమ్ ద్వారా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి సహకారం అందించాలన్నారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే కార్యక్రమాలను ఆర్డీఓ పర్యవేక్షించాలన్నారు. గ్రౌండ్‌లో విఐపిల సిట్టింగ్, స్టేజ్‌పై వున్న వారికి స్నాక్స్, జ్ఞాపికలు, విఐపిలకు ఆహ్వానం తదితర ఏర్పాట్లను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని చిత్తూరు తహసిల్దారు, డిఎస్ఓలను జెసి ఆదేశించారు. అలాగే జిల్లా ప్రగతి తెలిపే ప్రసంగ సందేశం, పబ్లిక్ అడ్రెస్ సిస్టంను సిద్ధం చేయాలని సమాచార శాఖ డిడి పద్మజను జెసి ఆదేశించారు. గ్రౌండ్‌లో జాతీయ జెండా, పెరేడ్‌కు సంబంధించి ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని పోలీసు శాఖను కోరారు. అలాగే వివిద శాఖల స్టాల్స్, శకటాల ఏర్పాటు తదితరాలను డిఆర్‌డిఏ పిడి డిఎంకె తులసీ, డ్వామా పిడి గంగా భవానీలు పర్యవేక్షించాలని జెసి ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రదర్శించే శకటాలు చిత్తూరు నగరంలోని ముఖ్య వీధుల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అలాగే ఆహుతులను ఆకట్టుకొనే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు వుండేలా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావును ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, చిత్తూరు మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయండి

### కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 5, ప్రభాతవార్త



నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. శనివారం సిటీ ఆపరేషన్ సెంటర్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ భవన నిర్మాణ పనులను, భవానీ నగర్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనార్థం విచ్చేస్తుంటారని దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు సుమారు 50 కోట్ల రూపాయిల స్మార్ట్ సిటీ నిధులతో ఆరు అంతస్థుల మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ భవన నిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని వచ్చే సంవత్సరం ఆగస్టు మాసానికి పూర్తి చేస్తామన్నారు. ఇక 80 కోట్ల రూపాయిలు స్మార్ట్ సిటీ నిధులతో లక్షా యాభై వేల అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతుందన్నారు. టిటిడి పరిపాలనా భవనం పక్కన నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించామని, పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించామన్నారు. పనులు పరిశీలనలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డిఈలు దేవిక, మోహన్, ఏఈకాం ప్రతినిధి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో సంకట హర చతుర్ధశి పూజలు

### విశేష సంఖ్యలో భక్తులు

శ్రీకాళహస్తి,ఆగస్టు 5 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థశి సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయంలోని అంజంజి వినాయక ఆలయం వద్ద ప్రతి నెల ప్రత్యేక పూజలు నిర్వహించే ఆనవాయితి ఉంది. ఈ నేపథ్యంలో శనివారం ఆలయం ఎదురుగా ప్రత్యేకంగా హోమాలు ఏర్పాటు చేసారు. ముఖ్య అతిధిగా ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరు కాగా ఆలయ అర్చకులు, పౌరోహితులు హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అంజూరు తారక శ్రీనివాసులతోపాటు అర్చకులు కరుణాకర్ గురుకుల్, వేదపండితులు అర్చకులు అనిల్‌శర్మ, పరిచాకులు రాకేష్ శర్మ ధర్మకర్తల మండలి సభ్యులు ప్రత్యేకాహ్వానితులు శ్రీదేవి,సిబ్బంది సుదర్శన రెడ్డి,కోళ్ళూరు హరినాయుడు,కోళ్ళూరు జయ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్

తిరుపతి,ఆగస్టు 5ప్రభాతవార్త:

టిడిపి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తిరుపతిలోని మంచినీళ్ళగుంటలో ఉన్న విశాలాక్షీ సమేత కాశీవిశ్వేశ్వరుని దర్శించుకున్నారు. శివాలయంలోని శనీశ్వరునికి పూజలు చేయించారు. అనంతరం ఆలయంలోనికి చేరుకుని స్వామిఅమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యనారాయణశర్మ, సుబ్రమణ్యశర్మ,ఉమామహేశ్వరశర్మలు వేద ఆశీర్వాదం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రజా సంక్షేమానికి కట్టుబడిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం- డిప్యూటి సిఎం

సత్యవేడు, ఆగస్టు 5,ప్రభాతవార్త:



మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని, అధికారులు కుల,వర్గ, మత పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేసి సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందేలా పనిచేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కళత్తూరు నారాయణ స్వామి అధికారులను ఉద్దేశించి అన్నారు. శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్‌లో సత్యవేడు నియోజకవర్గ సమీక్ష ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన జిల్లా ప్రణాళిక శాఖ నిర్వహించగా సత్యవేడు శాసన సభ్యులు కోనేటి ఆదిమూలం, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి,జేసి డికె బాలాజీ, ఆర్డీఓలు రామారావు, చంద్రముని జిల్లా, సంబంధిత డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ సమీక్షలో శాసన సభ్యులు సూచించిన అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పేదల తలరాతలు మార్చుతున్న ఈ ప్రభుత్వానికి అండగా ఉండి సేవలు అందించాలని సూచించారు. శాసన సభ్యులు కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ప్రజా సేవలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ప్రజా ప్రతినిధులు సూచించిన, తెలియజేసిన అంశాలపై అధికారులు సకాలంలో స్పందించి, పరిశీలించి సత్వర పరిష్కారాల కోసం తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసందర్భంగా కాళంగి రిజర్వాయర్ మరమ్మత్తులు, డిగ్రీ కళాశాల మరమ్మత్తులు, హౌసింగ్ సమస్యలును అధికారుల దృష్టికి తీసుకుని వచ్చి తక్షణ చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. జేసి డికె బాలాజీ మాట్లాడుతూ అధికారులు వారి స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, నియోజకవర్గ సమీక్షలో సూచించిన అంశాలు పై అధికారుల దృష్టికి పెట్టాలని, ప్రభుత్వానికి నివేదించాల్సినవి వెంటనే పంపాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పోలీసులపై దాడులు నిరసిస్తూ వైకాపా నిరసన

బంగారుపాళ్యం, ఆగస్టు 5 ప్రభాతవార్త:



పుంగనూరు పట్టణంలో పోలీసులపై తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు దాడులు చేశారు. ఈ దాడులకు నిరసనగా శనివారం బంగారుపాళ్యంలో వైకాపా నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్ర మాలు జరిగాయి. జిల్లా వైఎస్ఆర్‌సిపి పార్టీ అధిష్టానం జిల్లా బంద్‌కు పిలుపు నివ్వడంతో బంగారుపాళ్యంలో శనివారం ఉదయం వైకాపా నాయకులు దుకాణాలు మూయించారు. రహదారికి ఇరువైపులా వున్న దుకాణాలను వైకాపా నాయకులు మూయించి నాలుగు రోడ్ల కూడలి వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబు దిష్టిబొమ్మను కార్యకర్తలు దగ్ధం చేశారు. జిల్లాలో ప్రశాంతంగా వున్న వాతావరణం నందు టిడిపి నాయకులు అలజడి సృష్టించి దాడులకు పాల్పడ్డారని రాష్ట్ర పాల ఏకెరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ దత్తత్రేయరెడ్డి, వైకాపా నాయకులు దొరస్వామి, ప్రకాష్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, జగదీష్, సురేంద్రబాబు, నాగరాజు, మహేంద్ర, మంజునాథ్, సుబ్రమణ్యం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే బంగారుపాళ్యం రోడ్డుపై టైర్లు కాల్చి వైకాపా నాయకులు నిరసన తెలిపారు. సంక్రాంతిపల్లి వద్ద వైకాపా నాయకులు కోడి విద్యాసాగర్ రోడ్డుపై తమ కార్యకర్తలతో కలిసి టైర్లు కాల్చి నిరసన తెలిపారు.

## చంద్రబాబు.. కంచర్లలు కుప్పానికి విజిటర్లు..

### నేను లోకల్ - ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త



ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌లు కుప్పానికి విజిటర్లు అని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ విమర్శించారు. శనివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. తనకు, తనతల్లి,భార్యకు కుప్పంలో ఓట్లు ఉన్నాయని అదే కుప్పంలో ప్రతిపక్ష నేతకు, ఎమ్మెల్సీ కంచర్లకు ఓట్లు లేవని పేర్కొన్నారు. కుప్పంలో వైకాపా జె ండా ఎగరడం ఖాయమని తెదేపా నేతలు కుప్పం వదిలేసి వెళ్లిపోవాలని సూచించారు. తనను నమ్ముకున్న ప్రజల కోసం తాను ఓడినా గెలిచినా కుప్పంలోనే ఉంటానని పేర్కొన్నారు. పుంగనూరు సంఘటన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. ఎంసి ఛైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ గతంలో ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు కుప్పం వచ్చినపుడు విధ్వంస కాండ సృష్టించారన్నారు. గత ఎన్నికల్లో కేవలం దొంగ ఓట్లతో చంద్రబాబు కుప్పంలో గెలిచారన్నారు. తెదేపా ఎన్నికల్లో పొత్తులు లేకుండా వస్తే తాము వైకాపాను వదిలేస్తామని ప్రకటించారు. మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ మాట్లాడుతూ ఆడలేక మద్దెలదరువు అనే రీతిలో తెదేపా నేతల వ్యవహారం ఉందన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు విజయ్, గణపతి, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశంపార్టీలోకి బొల్లినేని

శ్రీకాళహస్తి,ఆగస్టు 5 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి మాజీ సర్పంచ్, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పలు ఆలయాలకు విరాళాలను అందిస్తున్న జెకెస్టీల్స్ అధినేత బొల్లినేని జగన్నాధం నాయుడు శనివారం శ్రీకాళహస్తిలో జరిగిన బహిరంగసభలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశంపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా చంద్రబాబునాయుడు ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించి పార్టీ గెలుపుకోసం కష్టపడి పనిచేయాలని కోరారు. ఆయనతోపాటు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎన్నికల సంఘం సూచనలు తుచా తప్పక పాటించాలి

### జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 5, ప్రభాతవార్త

ఎన్నికల సంఘం ఈ నెల 2,3 తేదిల్లో విశాఖలో నిర్వహించిన సమీక్షలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2024లో ప్రతి ఓటరు తొలగింపు, చేర్పులకు సంబంధించిన రికార్డులు నిర్వహణ వుండాలని ఎన్నికల కమిషన్ అడిగినప్పుడు చూపాల్సి వుంటుందని తేడా వుంటే చర్యలు తీవ్రంగా వుంటుందని తెలిపారని ఆ మేరకు పక్కాగా వుండాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా సవరణ 2024 పై ఈఆర్ఓ, ఏఈఆర్‌ఓలతో జిల్లా కలెక్టర్, జేసి డికె బాలాజీ సమీక్ష నిర్వహించారు. జేసి మాట్లాడుతూ ఎన్నికల సంఘం సమీక్షకు హాజరయ్యాయనని పలు సూచనలు చేశారని తప్పక పాటించాలని, ప్రతి ఓటరు రికార్డు ఉండాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల సంఘం వారి యాప్ ఆన్‌లైన్ అప్‌లోడ్ చేసినా తప్పని సరిగా సంబంధిత ఫారమ్‌లో ఆ ఇంటి వారి సంతకం వుండాలని అన్నారు. డోర్ నెంబర్‌కు సరిపడా ఓటరు కార్డు ఉండాలన్నారు. కొత్త వారు ఓటరు నమోదు పూర్తి స్థాయిలో జరిగాలన్నారు.